ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
పల్నాడు జిల్లా వార్తలు
5
మంగళవారం 9 సెప్టెంబరు 2025



చంద్రవంక నదిపై నిర్మించిన ఆక్విడెక్టు

# ప్రమాదపు అంచుల్లో బొంబాయి బ్రిడ్జి

- బ్రిడ్జిని అల్లుకున్న చెట్లు, లీకవుతున్న నీరు
- ప్రమాదం జరిగితే తాగు, సాగునీటికి ఇక్కట్లు

మాచర్ల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణ సమీపంలోని సాగర్ కుడి కాలువ వద్ద చంద్రవంక నదిపై బొంబాయి కంపెనీ నిర్మించిన ఆక్విడెక్టు ప్రమాదపు అంచుల్లోకి చేరుకుంది. ఆక్విడెక్టు చుట్టూ మర్రిచెట్లు, జువ్విచెట్లు అల్లుకుపోవడంతో నెర్రలిచ్చి నీరు లీకవుతోంది. సాగర్ కుడి కాలువ 15వ కిమీ వద్ద మాచర్ల సమీపంలో బొంబాయికు చెందిన కాంట్రాక్టర్ కంపెనీ ఆక్విడెక్టును నిర్మించింది. చంద్రవంక నదికి వరద నీరు ప్రవహించేందుకు బ్రిడ్జిని నిర్మించి దానిపై భాగంలో కుడి కాలువ ద్వారా 11 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం జరిగేలా బొంబాయి కంపెనీ ఆక్విడెక్టును నిర్మించింది. కింది భాగంలో ఆరు కానాలు ద్వారా 33,750 క్యూసెక్కుల చంద్రవంక వరద నీరు ప్రవహించేలా ఏర్పాట్లు చేసింది. అయితే ఆక్విడెక్టు చుట్టూ మర్రిచెట్లు, జువ్విచెట్లు అల్లుకుపోవడంతో నెర్రలిచ్చి నీరు లీకవుతోంది. బ్రిడ్జికి ఇరువైపులా పెద్ద పెద్ద వృక్షాలు పెరిగి ప్రమాదభరితంగా మారాయి.

**ప్రమాదం జరిగితే..**

సాగర్ కుడి కాలువ ద్వారా ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో 6,68,230 ఎకరాలు, ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో 4,43,180 ఎకరాలు మొత్తం కలిపి 11,11,410 ఎకరాల ఆయకట్టుకు సాగు, తాగునీరు ప్రవహిస్తోంది. ఆక్విడెక్టుకు ప్రమాదం జరిగితే దాని పునర్నిర్మాణానికి భారీ వ్యయంతోపాటు సమయం వృథా అవుతాయి. అలాగే ఆయకట్టుకు సాగునీటితోపాటు తాగునీరు అందక గ్రామాలు అల్లాడిపోతాయి. ఇరిగేషన్ అధికారులు ఇప్పటికైనా దీనిపై ప్రత్యేక దృష్టి సారించి చెట్లను తొలగించి లీకులను అరికట్టాల్సి ఉంది. అయితే అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనబడుతోంది. వృక్షాలు ఆక్విడెక్టును కమ్మేస్తుంటే వారు కన్నెత్తి కూడా చూడకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. నెర్రలు పెద్దవై జరగరానిది జరిగితే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. ఇరిగేషన్ అధికారులు సత్వరమే స్పందించి వృక్షాలను తొలగించి మరమ్మతులు నిర్వహించి లీకులను అరికట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



ఆక్విడెక్టు చుట్టూ పెరిగిన చెట్లు, లీకవుతున్న నీరు

# మంగళగిరికి.. పసిడి వెలుగులు

- గోల్డ్ హబ్‌కు రంగం సిద్ధం
- 78 ఎకరాల్లో గోల్డ్ క్లస్టర్
- సీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు
- అసైన్డ్ భూముల్లో.. భూసమీకరణ
- 171 మంది భూయజమానులకు కలుగనున్న లబ్ధి
- సీఆర్‌డీఏకు ప్రతిగా నాలుగెకరాలు
- ప్రారంభమైన కార్యాచరణ

**జాతీయ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేసేలా మంగళగిరిలో అంతర్జాతీయ మార్కెట్ ఏర్పాటవుతోంది. అదే జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్కు. దేశంలో కెల్లా అతిపెద్ద గోల్డ్ హబ్‌గా దీనిని తీర్చిదిద్దే ప్రణాళిక రూపుదిద్దుకుంటుంది. తొలిదశలో రూ. అయిదు వేల కోట్ల పెట్టుబడులను సాధించడమే లక్ష్యంగా ఏర్పాటవుతున్న ఈ గోల్డ్‌హబ్ అతిత్వరలోనే మరిన్ని వేలకోట్ల పెట్టుబడులకు ఆకర్షణ కేంద్రంగా మారుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. నగరంలోని తెనాలి రోడ్డు వెంబడి 78 ఎకరాల విస్తీర్ణంలో దీనిని నెలకొల్పేందుకు ఏపీ సీఆర్‌డీఏ సన్నద్ధమైంది. భూసమీకరణ రూపంలో భూములను సేకరించడంతోపాటు సంబంధిత వెంచర్‌ను అభివృద్ధి చేసే బాధ్యతలను రాష్ట్రప్రభుత్వం సీఆర్‌డీఏకు అప్పగించింది. ఈ వెంచర్‌ను అభివృద్ధి చేసినందుకుగాను ఆ సంస్థకు నాలుగెకరాల భూమిని ఇచ్చేవిధంగా రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులను వెలువరించింది. ఈ మొత్తం అభివృద్ధి ప్రణాళికంతా మంత్రి నారా లోకేశ్ మస్తిష్కంలో రూపుదిద్దుకుందే కావడం గమనార్హం!**



మంగళగిరిలో జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్కు కోసం ఎంపిక చేసిన స్థలం

(ఆంధ్రజ్యోతి, మంగళగిరి)

మంగళగిరి అభివృద్ధిని పరుగులు పెట్టించనున్న మరో ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టు జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్కు. దాదాపు అయిదువేల కోట్ల పెట్టుబడులతో ప్రారంభం కానున్న గోల్డ్ క్లస్టర్...మంగళగిరికి అంతర్జాతీయ చిత్రపటంలో ఓ ప్రత్యేక గుర్తింపును తీసుకురానుంది. ఈ ప్రాజెక్టును తెనాలి రోడ్డు వెంబడి అక్షయపాత్ర ఫౌండేషన్ భవన సముదాయానికి దక్షిణంగా సుమారు 78.01 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటవుతోంది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం తుది నిర్ణయానికి వచ్చేసింది. ఈ ప్రాజెక్టు సన్నాహక బాధ్యతలను రాష్ట్రప్రభుత్వం ఇటీవలే జరిగిన రాష్ట్రమంత్రివర్గ సమావేశంలో సీఆర్‌డీఏకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది. గోల్డ్ క్లస్టర్‌కోసం ఎంచుకున్న ఈ భూమి ఆత్మకూరు పరిధిలో సర్వే నెం.లు 132, 133, 134 కింద వున్నాయి. అయితే ఇవన్నీ అసైన్డ్ భూములు. అయినప్పటికీ రాష్ట్రప్రభుత్వం రాజధాని అమరావతి కోసం వినియోగించిన ఫార్ములానే ఇక్కడ కూడ వినియోగించేలా నిర్ణయం తీసుకుంది. భూసమీకరణ కింద 34వేల ఎకరాలకు పైగా భూములను ఒక్క పైసా ఖర్చులేకుండా తీసుకున్న రాష్ట్రప్రభుత్వం గోల్డ్ క్లస్టర్ కోసం కూడ అదే భూసమీకరణ ఫార్ములాను మళ్లీ ప్రయోగిస్తుంది. ఈ మొత్తం అసైన్డ్ భూములన్నింటినీ కూడ పూర్తిగా భూసమీకరణ కిందే తీసుకోవాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రక్రియ ద్వారా మొత్తం 78.01 ఎకరాలను సేకరించడంతోపాటు గోల్డ్ క్లస్టర్ ఏర్పాటు బాధ్యతలను కూడ సీఆర్‌డీఏ చేపట్టేవిధంగా మంత్రివర్గ సమావేశంలో తీర్మానించారు. అంటే వెంచర్‌ను ఏర్పాటుచేయడం మొదలు మౌలిక సదుపాయాల కల్పనంతా (మిగతా 6లో)



వినుకొండలోని మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలలో జిల్లా వైద్యాధికారి రవికుమార్

# గురుకులంలో విషజ్వరాలు

- పాఠశాలను పరిశీలించిన జిల్లా వైద్యాధికారి రవికుమార్
- పిల్లల రక్తనమూనాల సేకరణ

వినుకొండటౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గురుకుల విద్యార్థులకు విషజ్వరాలు సోకుతున్న నేపథ్యంలో వసతిగృహ వార్డెన్లు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి రవికుమార్ అన్నారు. మండలంలోని బ్రహ్మణపల్లిలో గల మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకులంలో 12 మంది విద్యా ర్థులకు వైరల్ జ్వరం సోకిన నేపథ్యంలో సోమవారం రవికుమార్, స్థానిక వైద్యసిబ్బందితో కలిసి ఆకస్మికంగా పాఠశాలను సందర్శించారు. ముందుగా హాస్టల్ పరిసర ప్రాంతాలను, అనంతరం వంటగదిని పరిశీలించారు. ముందస్తు జాగ్రత్తగా తరగతి గదులను శుభ్రం చేయించారు. విద్యార్థుల రక్త నమూనాలను సేకరించి విషజ్వరాలపై ఆరాతీశారు. విద్యార్థుల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, జ్వరం సోకిన వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించాలని అన్నారు. వారి తల్లిదండ్రులకు సమాచారం అందించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. జ్వరాల అదుపు నకు సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఎస్ఎస్‌పీ కాలనీలోని అర్బన్ వైద్యశాలను పరిశీలించి ఏఎన్ఎంలతో సుమారు గంటకుపైగా సమావేశం నిర్వహించారు. జిల్లా వైద్యాధికారి రవికుమార్‌తో డీఎంవో రవీంద్ర, ఏనుగుపాలెం వైద్యాధికారి నాగేశ్వరరావు నాయక్ ఉన్నారు.

'స్వర్ణ పంచాయతీ'కి శ్రీకారం!
- గ్రామాల్లో ఇంటి పన్ను వివరాల డిజిటలైజేషన్
- కొలిక్కి వస్తున్న ఆన్‌లైన్ ప్రక్రియ

శతమానం భవతి..!
- మంగళగిరి వైద్య ప్రదాయినిగా వంద పడకల ఆస్పత్రి
- అత్యాధునిక వసతులతో.. శరవేగంగా నిర్మాణ పనులు

8

ఉద్యాన వికాసం.. రాయితీ సహకారం!
- ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం
- ఉపాధి హామీ పథకం అనుసంధానంతో ఆర్థిక తోడ్పాడు

# నిబంధనల సడలింపుపై ఆశలు

- జిన్నింగ్ మిల్లుల యజమానులతో నేడు సీసీఐ సీఎండీ సమావేశం..!
- మార్కెటింగ్ కమిషనర్ కార్యాలయంలో చర్చలు

గుంటూరు సిటీ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జిన్నింగ్ మిల్లుల యజమానులకు, సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)కి మధ్య ఏర్పడిన ప్రతిష్టంభన తొలగేందుకు మార్గం సుగమమైంది. గుంటూరులోని రాష్ట్ర మార్కెటింగ్ కమిషనర్ కార్యాలయంలో జిన్నింగ్ మిల్లుల యజమానులతో సీసీఐ సీఎండీ లలిత్ కుమార్ గుప్తా మంగళవారం భేటీ కానున్నారు. పత్తి మిల్లుల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు సీసీఐ జారీ చేసిన టెండర్ ప్రక్రియను ఏపీలోని జిన్నింగ్ మిల్లుల యజమానులు బహిష్కరించిన నేపథ్యంలో జరుగుతున్న ఈ సమావేశం ఆసక్తిని కలిగిస్తోంది. ఆగస్టు 12వ తేదీన సీసీఐ విడుదల చేసిన టెండర్ నోటిఫికేషన్‌లోని కొన్ని నిబంధనలపై జిన్నింగ్ మిల్లుల యజమానులు భగ్గుమంటున్నారు. వాస్తవానికి ఈ సీజన్‌లో వచ్చిన టెండర్ నోటిఫికేషన్‌లోని నిబంధనలను రాష్ట్రంలోని జిన్నర్లే కాకుండా, దేశంలో మిగతా రాష్ట్రాలకు చెందిన వారు కూడా వ్యతిరేకిస్తున్నారు. బిడ్డింగ్‌కు సెప్టెంబరు 1వ తేదీని సీసీఐ గడువు విధించినప్పటికీ దేశవ్యాప్తంగా ఉన్న జిన్నింగ్ మిల్లుల యజమానులు టెండర్లు వేయలేదు. పత్తి కొనుగోలు కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు, మిల్లులను ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3, ఎల్ 4, ఎల్ 5లుగా విభజించటం, పత్తిని ఫలానా చోటే రైతులు అమ్ముకోవాలని ఆదేశించడం, దూది నాణ్యత శాతాన్ని పెంచాలన్న నిబంధనలను మిల్లుల యజమానులు వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 3వ తేదీన రాష్ట్ర వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు రాష్ట్రంలోని జిన్నింగ్ మిల్లుల యజమానులు, సీసీఐ అధికారులతో సచివాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిన్నింగ్ మిల్లుల యజమానుల సమస్యలను సావధానంగా విన్న మంత్రి సీఎండీతో సమావేశం నిర్వహించాలని సీసీఐ అధికారులను ఆదేశించారు. మంత్రితో సమావేశం ముగిసిన తర్వా త వ్యవసాయశాఖ ఎక్స్ అఫీషియో కార్యదర్శికి మార్కెటింగ్‌శాఖ కమిషనర్ సీసీఐ సీఎండీతో మీటింగ్ ఏర్పాటుపై లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి లేఖ వెళ్ల డంతో జిన్నింగ్ మిల్లుల యాజమానులతో చర్చలు జరిపేందుకు సీసీఐ సీఎండీ మంగ ళవారం గుంటూరుకు వస్తున్నట్లు తెలి సింది. రాష్ట్ర మార్కెటింగ్ కమిషనర్ కార్యాల యంలో జరగనున్న సమావేశంలో జిన్నింగ్ మిల్లుల యజమానులతో పాటు, వ్యవసా యశాఖ, మార్కెటింగ్‌శాఖ రాష్ట్ర ఉన్నతాధి కారులు పాల్గొంటున్నట్లు సమాచారం. టెండర్ నిబంధనలను సడలిస్తే జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కు తాము సిద్ధమేనని యజమానులు చెబుతున్నారు.



## యూరియా కోసం రైతన్నల ఆందోళన

ఈపూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈపూరు సొసైటీ వద్ద యూరియా కోసం సోమవారం రైతులు బారులు తీరారు. సొసైటీ సిబ్బంది రైతుల ఆధార్‌ను పరిశీలించి రెండు కట్టలు చొప్పున అందజేస్తున్నారు. ఎక్కువమంది రైతులు రావడంతో కొద్దిసేపు అక్కడ గందరగోళం నెలకొంది. యూరియా కట్టలు ఇచ్చేందుకు ఆలస్యం అవ్వడంపై కొందరు రైతులు ఆందోళనకు దిగారు. రోడ్డుపై ఐదు నిమిషాలు కూర్చొని నిరసన తెలియజేస్తుండగా మరలా కట్టలు ఇస్తుండడంతో ఆందోళన విరమించారు. సొసైటీ వద్ద యూరియా కట్టల కోసం రైతులు ధర్నా చేస్తున్నారని వైసీపీ సోషల్ మీడియా, జగన్ మీడియాలో రావడంపై ఈపూరు సొసైటీ చైర్మన్ విడపలపాటి హనుమయ్య స్పందించారు. కావాలనే వైసీపీ నాయకులు రైతులను రెచ్చగొడుతున్నారని, సరిపోయినంత యూరియా అందుబాటులో ఉందన్నారు.



యూరియా కోసం రోడ్డుపై బైఠాయించిన రైతులు

## గ్రామస్థాయిలో యూరియా అవగాహన బృందాలు

**కలెక్టర్ అరుణ్‌బాబు**

నరసరావుపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): యూరియాపై రైతుల్లో ఆందోళనలు తొలగిస్తూ, వాస్తవ పరిస్థితులను తెలియజేసేందుకు గ్రామ స్థాయిలో అవగాహన బృందాలను ఏర్పాటు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు సోమవారం తెలిపారు. వీఆర్వో, మహిళా పోలీసు, వ్యవసాయ, ఉద్యాన సహాయకులు బృందంలో సభ్యులుగా ఉంటారని ఆయన చెప్పారు. అవగాహన బృందాలు ప్రతి రైతు వద్దకూ వెళ్లి జిల్లాలో యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్న విషయం వివరిస్తాయని, యూరియాను పొందడంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, సాగు చేసిన భూమికి అవసరమైన యూరియా రైతులకు లభించిందా అనే అంశాలపై అధికారులకు నివేదిస్తాయని తెలిపారు. వారం రోజులపాటు అవగాహన బృందాలు గ్రామాల్లో పర్యటిస్తాయని చెప్పారు. జిల్లాలో యూరియా కొరత లేదన్న విషయం స్పష్టం చేస్తూనే, అవసరానికి మించి యూరియా కొనుగోళ్లు చేయవద్దని రైతులకు విజ్ఞప్తి చేస్తాయని తెలిపారు. రానున్న మూడు రోజులు మండల స్పెషల్ ఆఫీసర్లు మండలాల్లోనే ఉండి యూరియా పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు.

## అన్నదాత పోరు కార్యక్రమానికి అనుమతి లేదు: డీఎస్పీ జగదీష్

గురజాలటౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టబోయే అన్నదాత పోరు కార్యక్రమానికి ఎటువంటి అనుమతులు లేవని గురజాల డీఎస్పీ జగదీష్ తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గురజాలలో పోలీసు యాక్ట్-30 అమల్లో ఉన్నందున డీజే, ర్యాలీ కార్యక్రమాలకు అనుమతులు లేవని చెప్పారు. వైసీపీ నేతలు, కార్యకర్తలు రోడ్డు మీదకు రావొద్దని సూచించారు. ఎవరైనా రోడ్లపైకి వచ్చి ర్యాలీలు నిర్వహిస్తే సీసీ ఫుటేజీ, డ్రోన్ కెమెరాల ద్వారా వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు.

## మా గ్రామాలను సత్తెనపల్లిలో విలీనం చేయవద్దు

**గండ్లూరు, భీమవరం పంచాయతీ వార్డు సభ్యులు డిమాండ్**

**కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేత**

నరసరావుపేట టౌన్/ సత్తెనపల్లి రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి పురపాలక సంఘంలో గండ్లూరు, భీమవరం గ్రామాలను విలీనం చేసే ప్రక్రియను ఉప సంహరించుకోవాలని కోరుతూ ఆయా గ్రామాల ప్రజలు సోమవారం పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబును కలసి వినతిపత్రం అందజేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి గ్రామ ప్రజల అభిప్రాయం మేరకే విలీన ప్రక్రియను కొనసాగించాలని కోరారు. గ్రామస్థులు ఆమోదం తెలపకుండానే పంచాయతీ కార్యదర్శి తీర్మానం చేసి మునిసిపాలిటీకి పంపారన్నారు. ఆయా గ్రామాల ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని విలీన కార్యక్రమాన్ని ఉపసంహరించుకోవాలని కలెక్టర్‌తో పాటు జిల్లా పంచాయతీ అధికారికి, ఆర్డీవోకు వినతిపత్రాలు అంద జేశారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన వారిలో పంచాయతీ వార్డు సభ్యులు బీ నరసింహారావు, ఒంటిపులి కోటేశ్వరమ్మ, కే అంకమరావు, ఎం భూలక్ష్మీ, పీ రాంబాబు, బంగారు శ్రీను, ఏ బుజ్జిబాబు, యరుదుట్ల రూతు, ఎంపీటీసీ దామచర్ల ధనలక్ష్మి, కే రామ మల్లేశ్వరరావు, పీ పిచ్చయ్య, పీ బాలయ్య, యండా పెద్ద వెంకయ్య, పీ సురే శ్, ఆర్ గురవయ్య, బండారు స్వామి, రామకృష్ణ, జీవీకే రావు, ఆర్ అశోక్, ఆర్ రవి తదితరులు ఉన్నారు.



కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేస్తున్న భీమవరం పంచాయతీ వార్డు సభ్యులు

# మట్టి లూటీ!



జిల్లాపేట తండా సమీపంలోని అటవీ భూమిలో అక్రమ మట్టి తవ్వకాలు జరిపిన ప్రదేశం

- నకరికల్లు మండలంలో రెచ్చిపోతున్న మట్టి దొంగలు
- అటవీ భూముల్లో అక్రమ గ్రావెల్ తవ్వకాలు
- ఏకంగా అధికారులతోనే భారీ డీల్..?
- నిదరోతున్న టాస్క్ ఫోర్స్.. కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి):

నకరికల్లు మండలంలో మట్టి లూటీ చేస్తున్నారు. అధికారం అండతో మట్టి దొంగలు రెచ్చిపోతున్నారు. అడ్డు అదుపు లేని రీతిలో మట్టి దందా సాగుతోంది. ఈ మండ లంలో జరు గుతున్న అక్రమ మైనింగ్‌ను అరికట్టాలన్న కలెక్టర్ పి.అరుణ్ బాబు ఆదేశాలను సైతం అధికారులు బేఖాతరు చేశారు. గ్రావెల్ అక్రమ రవాణాను అరికట్టేందుకు ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్సు జిల్లా, మండలస్థాయిల్లో.. నిద్రపోతున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొందరు అధికారులు నెల వారి మామూళ్లు దండుకుంటూ గ్రావెల్ దోపిడీకి సహకరిస్తున్నారన్న ఆరోపణలు న్నాయి. ప్రతి నెలా వేలాది లారీల మట్టిని విక్రయించుకుంటూ అక్ర మార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. చివరకు అటవీ భూములనూ వదిలి పెట్టడం లేదు. జిల్లాపేట తండా సమీ పంలోని అటవి భూముల్లో యథేచ్ఛగా అక్రమ మైనింగ్ జరుగుతోంది.



**అంతా తవ్వేస్తున్నారు..**

**చల్లగుండ్ల రెవెన్యూ పరిధి, గుర్రాల కొండ ప్రాంతం, గుంటూరు బ్రాంచ్ కెనాల్ పక్కనే భూముల్లో, కుంకలగుంట నుంచి ఇనుమెళ్ల వెళ్లే మార్గంలో అద్దంకి బ్రాంచ్ కెనాల్ పక్కన, నరసింగపాడు పూరిబోడు వద్ద క్వార్ట్జ్, త్రిపురాపురం కొండ వద్ద పెద్దఎత్తున మట్టి మైనింగ్ జరుగుతోంది.**

**అధికారులతో మట్టి మాఫియా డీల్..**

ఇటీవల ఓ ప్రభుత్వ కార్యాలయంలో మట్టి దొంగలు అధికారులతో సమావేశం అయినట్లు మండలంలో కోడై కూస్తోంది. ఈ సమావేశం జరిగిన అనంతరం అక్రమ మైనింగ్‌ను మరింత ఉధృతం చేశారు. కొందరు అధికారులతో.. ఈ మట్టి మాఫియా పెద్దడీల్ కుదుర్చుకుందని, పెద్దఎత్తున ముడుపులు చేతులు మారాయన్న ప్రచారం జరుగుతోంది. సాగర్ కుడి కాలువ కట్టపై నుంచి మట్టి లారీలు వెళ్తున్నాయి. అటవీ భూముల్లో మైనింగ్ జరుగుతున్నా సంబంధిత అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదు. మండలానికి చెందిన అధికార పార్టీ నేత ఒకరు ఈ అక్రమ మైనింగ్ చేస్తున్నట్లు సదరు పార్టీ నేతలే ప్రచారం చేస్తున్నారు. ఈ వ్యక్తి ఇంతకముందు రేషన్ బియ్యం మాఫియాను కూడా నడిపినట్లు సమాచారం. నకరికల్లు నుంచి శివాపురం తండా మార్గంలో ఉన్న కొండల్లో కూడా అక్రమ మైనింగ్ కొంత కాలంగా జరుగుతోంది.

**కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు**

నకరికల్లు త్రిపురాపురం కొండ వద్ద జరగుతున్న అక్రమ మైనింగ్ వ్యవహారం గతంలో అటుగా వెళ్తున్న కలెక్టర్ పి.అరుణ్‌బాబు కంటపడింది. దీంతో మట్టి తవ్వకాలకు వినియోగిస్తున్న యంత్రాలను వాహనాలను అయన సీజ్ చేశారు. ఈ నేపథ్యంలో జిల్లాలో అక్రమ మైనింగ్ నిరోధించాలని సంబంధిత అధికారులను అయన ఆదేశించారు. అయితే అధికారుల పనితీరులో మార్పురాలేదన్న విమర్శలున్నాయి. జిల్లాలో అక్రమ మైనింగ్‌ను అడ్డుకునేందుకు రెవెన్యూ, మైనింగ్, పోలీసు ఉన్నతాధికారులతో, మండల స్థాయిలో రెవెన్యూ, పోలీసు తదితర అధికారులతో టాస్క్‌ఫోర్సును ఏర్పాటు చేశారు. ఈ బృందాలు నిద్రపోతుండటం వల్లే.. పెద్దఎత్తున మట్టి మైనింగ్ జరుగుతుందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా మట్టి మాఫియాను అరికడతారో లేదో చూడాలి.

# 11న ఉప ముఖ్యమంత్రి పర్యటన

● సూర్యలంక తీరంలో మడ మొక్కలు నాటనున్న పవన్‌కల్యాణ్
● ఏర్పాట్లపై కలెక్టర్ వెంకటమురళి సమీక్ష


సమీక్షలో కలెక్టర్ జె.వెంకట మురళి, ఎస్పీ తుషార్ డూడి

బాపట్ల,సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ ఈ నెల 11న బాపట్ల జిల్లాలో పర్యటించనున్నారని కలెక్టర్ జె. వెంకటమురళి తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై అన్ని శాఖల జిల్లా అధికారులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మడ అడువుల అభివృద్ధిలో భాగంగా సూర్యలంక తీరంలో మడ మొక్కలను ఉప ముఖ్యమంత్రి నాటుతారని తెలిపారు. పవన్ కల్యాణ్ పర్యటన ఖరారు కావడంతో అధికారులంతా అప్రమత్తం కావాలన్నారు. మంత్రి పర్యటన సజావుగా సాగడానికి సమగ్ర ప్రణాళికతో అధికారులు ముందుకు సాగాలని ఆయన ఆదేశించారు. భద్రతా ఏర్పాట్లు చూసుకోవాలని ఎస్పీకి సూచించారు. తీర ప్రాంతంలో పారిశుధ్యం, హెలీపాడ్ వద్ద ప్రొటోకాల్ అమలు, స్టాల్స్ ఏర్పాటుపై సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎస్పీ తుషార్‌డూడీ, ఇన్‌చార్జి జేసీ, డీఆర్‌వో జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీవోలు తదితరులు పాల్గొన్నారు.

# అంబటి అవినీతిపై విచారణ చేపట్టాలి


కలెక్టరేట్‌కు వచ్చిన విజయ్ కిరణ్‌బాబు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి అంబటి రాంబాబు అవినీతిపై విచారణ చేపట్టాలని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి యర్రమాల విజయ్ కిరణ్‌బాబు సోమవారం జిల్లా కలెక్టర్‌ను కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏపీఐఐసీ చైర్మన్‌గా పనిచేసిన సమయంలో జోకిపర్రులోని వెనుకబడిన కులాల వారికి కేటాయించాల్సిన షెడ్డులను.. తన అనుచర కుటుంబానికి కేటాయించుకుని అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఏపీఐఐసీ నియమ నిబంధనల ప్రకారం లీజు నుంచి ఔట్‌రైట్ సేల్‌ను చేసిన వారిపై విజిలెన్స్ విచారణ చేసి.. నివేదికలో నేరాన్ని నిరూపించిందని పేర్కొన్నారు. ప్రభుత్వ రాయితీలు పొందడంలో కూడా అనేక అక్రమాలకు పాల్పడ్డారని.. ఈ మొత్తం స్కాంలో ప్రధాన సూత్రధారి అంబటి రాంబాబు, అతని అనుచరులపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఆత్మహత్య నివారణ చర్యలు తీసుకోవాలి

● ఏఎన్‌యూ వీసీ ఆచార్య గంగాధరరావు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య గంగాధరరావు

ఏఎన్‌యూ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఆత్మహత్యల నివారణ అవగాహన కార్యక్రమాలు యువతకు ఎంతో దోహదపడతాయని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వీసీ ఆచార్య గంగాధరరావు పేర్కొన్నారు. వర్సిటీలోని సైకాలజీ విభాగంలో పది రోజుల పాటు సమాజంలో ఆత్మహత్యల నివారణ పై అవగాహన సదస్సులు నిర్వహించారు. సైకాలజీ విభాగ విద్యార్థులు ఫార్మసీ, ఇంజనీరింగ్, ఆర్ట్స్ సైన్స్ విభాగాలకు వెళ్లి అవగామన కల్పించారు. అనంతరం వీసీని ఆయన చాంబర్‌లో కలిసి అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ విద్యార్థుల చైతన్యంతో ఆత్మహత్యలపై సమాజంలో మార్పులు తీసుకుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సైకాలజీ విభాగ అధ్యాపకులు జి.చెన్నారెడ్డి పాల్గొన్నారు.

## దాడి చేయడం..

# ఎదురు కేసులు పెట్టడం వైసీపీ పనిగా మారింది

● జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు


మాట్లాడుతున్న మక్కెన మల్లికార్జునరావు

వినుకొండ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): శావల్యాపురం మండలం కారుమంచి గ్రామంలో కొన్ని రోజులుగా జరుగుతున్న గొడవలపై జీడీసీసీ బ్యాంక్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు తీవ్రంగా స్పందించారు. స్థానిక టీడీపీ కార్యాయంలో శావల్యాపురం మండలం టీడీపీ నాయకులతో కలిసి మక్కెన సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. దాడి చేయడం, ఎదురు కేసులు పెట్టడమే వైసీపీ నాయకులకు పనిగా మారిందన్నారు. కారుమంచి గ్రామంలో జరిగిన తప్పును కప్పి పుచ్చుతూ మాజీ ఎమ్మెల్యే బొల్లా రకరకాల కథనాలు అల్లుతున్నారని ఆయన మండిపడ్డారు. ఈ నెల 4న టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం నిమజ్జన కార్యక్రమంలో వైసీపీ సానుభూతిపరులు కావాలని ముప్పా సురేష్‌పై దాడి చేశారన్నారు. ఈ ఘర్షణ వెనుక ఎవరు ఉన్నారో అందరికీ అర్థమవుతోందన్నారు. దాడి చేసిన వారిని పట్టు కోవడానికి వెళ్లిన పోలీసులపై దాడి చేసింది వాస్తం కాదా అని ప్రశ్నించారు. పోలీసులపైనే దాడి చేస్తే వారు ఎందుకు ఊరుకుంటారని, సీసీ ఫుటేజీ ఆధారంగానే కేసులు పెట్టారని మక్కెన వివరించారు. ఇదే క్రమంలో కొందరు టీడీపీ కార్యకర్తలపై కూడా చట్టపరంగా కేసులు కట్టారని తెలిపారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వంలో టీడీపీ మహిళపై కేసు పెట్టడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. మాజీ ఎమ్మెల్యే బొల్లా కావాలనే కారుమంచి ఘటనపై రాజకీయం చేస్తున్నారని దుయ్యబట్టారు. కారుమంచిలో బొల్లా ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఎన్టీఆర్ బొమ్మ విషయంలో గొడవ జరిగితే తెలుగు దేశం పార్టీ వారిని దారుణంగా కొట్టారని, 307 కేసులు పెట్టి 15 రోజులు జైల్లో ఉంచిన దుర్మార్గాలు చూశామన్నారు. ఆనాటి దాడుల్లో తలలు పగిలినా, కళ్లు పోయినా, కాళ్లు విరిగినా తాము ప్రతికారానికి దిగలేదని తెలిపారు. కుటుంబ తగాదాలు జరిగినా.. రెడ్‌బుక్ అంటూ కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు, యర్రమాస్ కోటేశ్వరరారవు, విశ్వనాథం మస్తాన్‌రావు పాల్గొన్నారు.

## నేటి నుంచి విద్యుత్ ఉద్యోగుల క్రీడా పోటీలు ప్రారంభం

గుంటూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): గుంటూరు కేంద్రంగా మూడు రోజుల పాటు జరుగనున్న విద్యుత్ శాఖ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. నగర శివారులోని అడవితక్కెళ్ళపాడు వద్దనున్న సబ్ స్టేషన్ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణంలో టెన్నిస్ పోటీలు, జేకేసీ కళాశాల ఆవరణలో బాస్కెట్ బాల్ పోటీలు 11వ తేదీ వరకు జరుగనున్నట్లు ఎస్‌ఈ చల్లా రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పోటీలను ఏపీ సీపీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ ఆవుల మురళీ కృష్ణయాదవ్ ప్రారంభించనున్నారు. విజేతలకు బహుమతుల ప్రదానం ఉంటుందని, క్రీడా పోటీలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.

# బాలికతో పెళ్లి చేయాలని సెల్ టవర్ ఎక్కి యువకుడి హల్‌చల్


యువకుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

తెనాలి క్రైం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తాను ప్రేమించిన అమ్మాయిని పిలిపించాలని, ఆమెను పెళ్లి చేసుకుంటానంటూ.. ఓ యువకుడు సెల్ టవర్ ఎక్కి రెండు గంటల పాటు హల్‌చల్ చేశాడు. ఈ ఘటన సోమవారం పాండురంగ పేటలో చోటుచేసుకుంది. ఉదయం 10 గంటల సమయంలో ఓ యువకుడు స్థానిక సెల్ టవర్ పైకి ఎక్కి .. పెద్దగా అరవడం ప్రారంభించాడు. దీనితో పెద్ద ఎత్తున జనం గుమిగూడారు. స్థానిక వార్డు కౌన్సిలర్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అతనిని బతిమాలి కిందికి దింపారు. సదరు యువకుడు విజయనగరం జిల్లా మక్కువ మండలం, నాగుల డబ్బాగడ్డకి చెందిన తాడంగి అశోక్‌గా పోలీసులు గుర్తించారు. ఇతను ఏడాది క్రితం తెనాలి వచ్చి తాపీ పనులు చేసుకుంటున్నాడు. అదే వీధిలో ఉంటున్న ఇంటర్మీడియెట్ చదువుతున్న 16 ఏళ్ల మైనరు బాలికను ప్రేమించానని.. బెదిరించి ఆ అమ్మాయిని పెళ్లికి ఒప్పించడానికే తాను సెల్ టవర్ ఎక్కానని తెలిపాడు. పోలీసులు విచారించగా అతను ఎవరో ఇంత వరకు చూడలేదని సదరు బాలిక తెలిపింది.ఈ క్రమంలో స్థానిక యువకులు ఆ యువకుడికి దేహశుద్ధి చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, విచారిస్తున్నట్లు ఎస్‌ఐ ఎన్.ప్రకాశరావు తెలిపారు.

# శ్మశానంలో రేకుల షెడ్డు, నీళ్ల ట్యాంకు ధ్వంసం


శ్మశానంలో కూల్చిన రేకుల షెడ్డు

వట్టిచెరుకూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని చమళ్ళమూడి గ్రామ శ్మశానంలో మృతుల అంత్యక్రియల కోసం దాతలు నిర్మించిన రేకుల షెడ్డు, నీళ్ల ట్యాంక్, బల్లలను ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీనిపై గ్రామస్తులు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఇనుప కంచెను కూడా ఇప్పటికే తొలగించారని, ఇది కావాలని గ్రామానికే.. చెందిన కొందరు ప్రోత్సహించి.. ధ్వంసం చేయించారని ఇతర గ్రామస్థులు ఆరపిస్తున్నారు. తహసీల్దార్‌కు కూడా అర్జీ ఇచ్చినట్టు పేర్కొన్నారు. సీఐ రమా నాయక్ శ్మశానంలో ఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై ఈ ప్రభావం తీవ్రంగా ఉంటుందని, కొందరు కావాలని ఈ విధంగా చేస్తున్నారని గ్రామస్తులు అంటున్నారు.

# పలు ఎక్స్‌ప్రెస్‌లకు రైల్వేస్టేషన్లలో స్టాపుల పునరుద్ధరణ

గుంటూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గతంలో కొన్ని రైల్వేస్టేషన్లలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఉన్న నిలుపుదల సౌకర్యాన్ని వివిధ కారణాలు చూపిస్తూ తొలగించిన రైల్వే శాఖ వాటిని పునరుద్ధరిస్తున్నట్లు ప్రకటించింది. 17211 మచిలీపట్నం - యశ్వంత్‌పూర్ కొండవీడు ఎక్స్‌ప్రెస్‌కి ఈ నెల 10 నుంచి బేతంచర్ల, దొనకొండ, 17212 యశ్వంత్‌పూర్ - మచిలీపట్నం కొండవీడు ఎక్స్‌ప్రెస్‌కి ఈ నెల 11 నుంచి బేతంచర్ల, దొనకొండ, 17222 ఎల్‌టీటీ - కాకినాడ ఎక్స్‌ప్రెస్‌కి ఈ నెల 11 నుంచి మౌలాలి, 17225 నరసపూర్ - హుబ్లీ అమరావతి ఎక్స్‌ప్రెస్‌కి ఈ నెల 10 నుంచి కురిచేడు, దొనకొండ, 17226 హుబ్లీ - నరసపూర్ అమరావతి ఎక్స్‌ప్రెస్‌కి ఈ నెల 10 నుంచి దొనకొండ, కురిచేడు, 17255 నరసపూర్ - లింగంపల్లి ఎక్స్‌ప్రెస్‌కి ఈ నెల 10 నుంచి బీబీనగర్, పిడుగురాళ్ల, 17256 లింగంపల్లి - నరసపూర్ ఎక్స్‌ప్రెస్‌కి ఈ నెల 10 నుంచి పిడుగురాళ్ల, 17625 కాచీగూడ - రేపల్లె డెల్టా ఎక్స్‌ప్రెస్‌కి ఈ నెల 10 నుంచి పిడుగురాళ్ల, 17626 రేపల్లె - కాచీగూడ ఎక్స్‌ప్రెస్‌కి ఈ నెల 10 నుంచి పిడుగురాళ్లలో నిలుపుదల సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు రైల్వేబోర్డు పేర్కొంది. 18047 షాలిమార్ - వాస్కోడిగామ ఎక్స్‌ప్రెస్‌కి ఈ నెల 11 నుంచి దొనకొండ, 18048 వాస్కోడిగామ - షాలిమార్ ఎక్స్‌ప్రెస్‌కి ఈ నెల 10 నుంచి దొనకొండ, 18463/18464 భువనేశ్వర్ - బెంగళూరు సిటీ - భువనేశ్వర్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఈ నెల 10 నుంచి దొనకొండలో నిలుపుదల సౌకర్యాన్ని కల్పించారు.

## అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్య


కోటేశ్వరరావు మృతదేహం

ముప్పాళ్ళ సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మాదల గ్రామంలో సోమవారం జరిగింది. కుటుంబ సభ్యులు, గ్రామస్థుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఎర్రంశెట్టి కోటేశ్వరరావు(43) ఏటా తన 2.65 ఎకరాలతో పాటు సుమారు 18 ఎకరాల వరకు కౌలుకు తీసుకుని పత్తి, మిరప, వరి, ఇతర పంటలను సాగుచేస్తుంటాడు. ఏటా నష్టం వస్తున్నా వినకుండా.. ఈ ఏడాది కూడా మిర్చి, వరి సాగు చేపట్టాడు. పంట రుణం రూ.3 లక్షలు, సొసైటీలో రూ.7.50 లక్షల అప్పు తీసుకుని ఉన్నాడు. ఇవికాక, పంటల సాగు కోసం, పిల్లల చదువులు కోసం.. బయట సుమారు రూ.43లక్షల వరకూ అప్పులు చేశాడు. పంటలపై ఏటా నష్టం రావడం, అప్పు తీర్చే మార్గం లేక తన ఇంటి పక్కనే ఉన్న పశువుల పాకలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు.. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సోమేశ్వరరావు తెలిపారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు మృతుడి కుటుంబ సభ్యుల నుంచి వివరాలను సేకరిస్తున్నారు. మృతునికి భార్య గోవిందమ్మ, కుమారుడు పంజాబ్ జలందర్‌లో బీటెక్ 3వ సంవత్సరం చదువుతుండగా, కుమార్తెకు వివాహమైంది.

# మంగళగిరికి.. పసిడి వెలుగులు

(5వ పేజీ తరువాయి)

సీఆర్‌డీఏ ఆధ్వర్యంలోనే జరుగుతుంది. ఇందుకుగాను మొత్తం 78 ఎకరాల్లో సీఆర్‌డీఏకు నాలుగెకరాలను అప్పగించాల్సి వుంటుంది.

గోల్డ్ హబ్ ఏర్పాటుకోసం సీఆర్‌డీఏ 78.01 ఎకరాలను భూసమీకరణ రూపంలో ప్రభుత్వానికి పైసా ఖర్చు లేకుండా సేకరించనుంది. ఈ మేరకు ఈ ప్రక్రియను ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించింది. ఇక్కడ మొత్తం భూ యజమానుల సంఖ్యను 171గా గుర్తించారు. ఇందులో ఎక్కువమంది 17 సెంట్ల వంతున కలిగివున్నారు. 171 మంది భూయజమానుల్లో సుమారు వందమందికి పైగా 2008లో ప్రభుత్వం నుంచి భూములను పొందినవారే. మొత్తం 171 మందిలో కేవలం 59 మంది మాత్రమే ఒరిజనల్ ఎస్సైనీలుగా వున్నట్టు రెవెన్యూ అధికారులు గుర్తించారు. మిగిలినవారంతా భూములను అనధికారికంగా ఇతరులకు విక్రయించారు. అయినప్పటికీ...కొనుగోలుదారులను కూడ భూయజమానులుగానే గుర్తించాలని స్థానిక శాసనసభ్యుడు, మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. నిజానికి అసైన్డ్ భూముల క్రయవిక్రయాలు చెల్లనేరవు కనుక చట్టం ప్రకారం చేయిమార్పిడి జరిగితే ఆ భూములను ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకునే వెసులుబాటు వుంది. అయినప్పటికీ మంత్రి లోకేశ్ మానవతా దృక్పథంతో కొనుగోలుదారులను కూడ భూ యజమానులుగానే గుర్తించాలని ఆదేశించడంతో రెవెన్యూ అధికారులు వారిని కూడ పరిగణనలోకి తీసుకుంటున్నారు. కాగా, ప్రస్తుత సందర్భంలో మొత్తం భూయజమానులు 171 మందిలో ఇప్పటికే 151 మంది భూసమీకరణ కింద తమ భూములను ఇచ్చేందుకు ప్రభుత్వానికి అంగీకారపత్రాలను అందజేశారు. మిగిలిన 20 మంది ఆచూకీ అధికారులకు ఇంకా లభ్యం కాలేదు. వారిని కూడ గుర్తించేందుకు రెవెన్యూ అధికారులు విచారణ నిర్వహిస్తున్నారు. భూసమీకరణ కింద భూములను ఇచ్చినవారికి రాజధాని ప్యాకేజీలనే ఇక్కడ కూడ అమలుచేయనున్నారు. జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్కు కోసం సీఆర్‌డీఏ రూపొందించనున్న వెంచర్‌తో సంబంధం లేకుండా వెంచర్‌కు వెనుకవైపు ప్రాంతంలో ప్రత్యేకంగా వీరికి కూడ కొన్ని ప్లాటులను కేటాయిస్తారని అంటున్నారు. ఇవన్నీ నివాస యోగ్యమైన ప్లాట్ల రూపంలో వుంటాయంటున్నారు. అయితే ఈ ప్లాట్ల పంపిణీ విషయానికొస్తే...ఒరిజినల్ ఎస్సైనీలకు ఒకలాగున, కొనుగోలుదారులకు ఇంకోలాగున ప్యాకేజీలను కేటాయిస్తారని అంటున్నారు. సుమారుగా 175 నివాసిత ప్లాట్లను వేర్వేరు విస్తీర్ణాలలో వచ్చేవిధంగా ప్రధాన కమర్షియల్ వెంచర్‌కు వెనుకభాగంలో ప్రత్యేక వెంచర్‌గా అభివృద్ధి చేసి అప్పగిస్తారు. ఈ నివాసిత ప్లాట్ల వెంచర్, ప్రధానమైన గోల్డ్‌క్లస్టర్ తాలూకు వెంచర్‌కు మధ్య సీఆర్‌డీఏకు దక్కాల్సిన నాలుగెకరాలు వుంటాయి.

## నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.45 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

## బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ (కిలో) | 130, 139, 150 |
| చికెన్ విత్ స్కిన్(కిలో) | 248.00 |
| చికెన్ స్కిన్ లెస్(కిలో) | 258.00 |

# కృష్ణా నదిలో దూకిన యువకుడు గల్లంతు


హర్షవర్ధన్ (ఫైల్)

కొల్లూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు కృష్ణా నదిలో దూకడంతో.. గల్లంతయిన ఘటన ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. మండల పరిధిలోని చింతల్లంక గ్రామానికి చెందిన తోడేటి హర్షవర్ధన్ (22) మరో ఇద్దరు యువకులు రాత్రి అరవింద వారధి వద్దకు వెళ్లారు. వారిలో ఓ యువకుడు అక్కడ నుంచి కొల్లూరు వెళ్లాడు. ఈ క్రమంలో వారధిపై నుంచి హర్షవర్ధన్ నదిలోకి దూకేందుకు యత్నించాడు. పక్కన ఉన్న యువకుడు అడ్డుకోగా.. అతని చేతిని కొరికి మరీ నదిలోకి దూకేశాడు. విషయం తెలుసుకున్న బంధువులు, గ్రామస్తులు రెవెన్యూ, పోలీసులకు సామాచారమిచ్చారు. సోమవారం ఉదయం పోలీసులు గజ ఈతగాళ్ల, ఫైర్ సిబ్బందితో యువకుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్ర అయినా.. యువకుడి ఆచూకీ లభించకపోవడంతో.. ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం రంగంలోకి దిగనున్నట్లు ఎస్‌ఐ అమరవర్ధన్ తెలిపారు. యువకుడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని, కుటుంబ సభ్యులు, బంధువులు ఇంత వరకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు ఇవ్వలేదన్నారు. తండ్రి అనారోగ్యంతో మృతి చెందగా..యువకుడు తల్లితో కలిసి ఉంటున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

## చికిత్స పొందుతూ..యువకుడి మృతి

పిడుగురాళ్ల, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పాతగణేశునిపాడు గ్రామానికి చెందిన పేర్ల రాంబాబు (21) గత నెల 26న పురుగు మందు తాగి గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ మోహన్ తెలిపారు. రాంబాబు హైదరాబాద్‌లో పనులకు వెళ్లి అక్కడ ఓ యువతికి తన ప్రేమను వ్యక్తపరిచినట్లు పేర్కొన్నారు. కానీ, ఆ యువతి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో మనస్తాపానికి గురైన రాంబాబు ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు.

## ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి

వినుకొండటౌన్, సెప్టెంబరు 8, (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఒకరు మృతి చెందిన ఘటన పట్టణ సమీపంలోని మార్కెట్ యార్డు వద్ద ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు వివరాల మేరకు.. పిట్టబండ గ్రామానికి చెందిన గీర తిరుపాల్ (33) ఈపూరు మండలం అంగలూరులోని అత్తారింటికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. బైక్ అదుపు తప్పి కింద పడడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య అనూష, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### గుర్తు తెలియని వ్యక్తి..

వినుకొండటౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుంటి ఆంజనేయ స్వామి దేవస్థానం, నాగమయ్య పుట్ట సమీపంలోని విశ్రాంత బల్లాపై వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని సోమవారం పోలీసులు గుర్తించారు. మృతుడు తెలుపు రంగు టీషర్టు, నల్ల ఫ్యాంట్, నెరిసిన గడ్డంతో ఉన్నట్లు తెలిపారు.

## దర్శనానికి వెళ్లొస్తూ.. అనంత లోకాలకు


లారీ వెనుకటైరు క్రిందపడ్డ దేవీవరప్రసాద్

గంటవారిపాలెం(శావల్యాపురం) సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): దేవుని దర్శనానికి వెళ్లి వస్తూ ప్రమాదవశాత్తు లారీ కిందపడి యువకుడు మృతి చెందిన ఘటన గుంటూరు - కర్నూలు జాతీయ రహదారిపై శావల్యాపురం మండలం గంటవారిపాలెం చెక్‌పోస్ట్ వద్ద జరిగింది. ఎస్‌ఐ లేళ్ళ లోకేశ్వరరావు వివరాల ప్రకారం.. విజయవాడ చిట్టినగర్‌కు చెందిన తమ్మిన దేవీ వరప్రసాద్, అశోక్ ఇద్దరూ కారు డ్రైవర్లుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. శనివారం సాయంత్రం దేవుని దర్శనానికి శ్రీశైలం వెళ్లి సోమవారం ఉదయాన్నే తిరిగి స్కూటీపై విజయవాడకు బయలు దేరారు. గంటవారిపాలెం చెక్‌పోస్ట్ వద్ద ముందర వెళ్తున్న డస్ట్ లోడు లారీని.. స్కూటీని నడుపుతున్న దేవీవరప్రసాద్ క్రాస్ చేసేందుకు ప్రయత్నించాడు. టిప్పర్ డ్రైవర్ అకస్మాత్తుగా కుడి వైపుకు రావడంతో టిప్పర్ స్కూటీ తగిలి.. దేవీవరప్రసాద్ కింద పడిపోయాడు. టిప్పర్ వెనుక టైరు అతని మీదుగా వెళ్లడంతో నడుము భాగంలో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. వెనుక కూర్చున్న అశోక్ మరో వైపునకు పడడంతో తలకు, కాళ్లకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు అశోక్‌ను వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకొన్న స్థానిక ఎస్‌ఐ లోకేశ్వరరావు మృతదేహానికి పోస్ట్‌మర్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## చికిత్స పొందుతూ బిటెక్ విద్యార్థి మృతి

అమరావతి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి నిమజ్జన ఉత్సవాల్లో రోడ్డు ప్రమాదానికి గురైన యువకుడు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. గుంటూరులో బీటెక్ చదువుతున్న రంగనాయక్(21)ను నిమజ్జనానికి అమరావతి వచ్చాడు. గత ఆదివారం ట్రాక్టర్‌లో వెళ్తుండగా.. ఓ కారు అతనిని ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకురాలు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మాచర్ల రూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మాచర్ల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయ పరిధిలోని మాచర్ల, రెంటచింతల, వెల్దుర్తి, దుర్గి, కారంపూడి మండలాలతోపాటు మాచర్లలో అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకురాలి పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్లు సీడీపీవో కృష్ణవేణి తెలిపారు. స్థానిక మహిళలై ఉండి వయసు 21నుంచి 35 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఈనెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

### పాఠశాలకు కుర్చీల వితరణ

దాచేపల్లి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): దాచేపల్లి ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థి, టీడీపీ యూత్ నాయకులు కొప్పుల గిరీష్‌కుమార్ పాఠశాలకు పది కుర్చీలను అందజేశారు. హెచ్‌ఎం, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్, ఇతర ఉపాధ్యాయులు, తోటి స్నేహితులు గిరీష్‌కుమార్‌ను అభినందించారు. పాఠశాలలో తలుపులు దెబ్బతినటంతో పూర్వ విద్యార్థులు పల్లపు వెంకటేశ్వర్లు, నాయబ్ అబ్దుల్లాలు తక్షణమే స్పందించి నూతన తలుపుల ఏర్పాటుకు పనులు చేపట్టారు.

### ఆర్థిక సాయం అందజేత

సత్తెనపల్లి: పట్టణానికి చెందిన జే రాధాకృష్ణమూర్తి గుండెజబ్బుకు వైద్యఖర్చుల నిమిత్తం ఆర్యవైశ్య చలివేంద్రం సంఘం అధ్యక్షుడు బచ్చు కొండలు, దివ్వెల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రూ.60వేలు బాధిత కుటుంబసభ్యులకు అందించారు.

### చేజర్లలో తుంగతుర్తి బుచ్చయ్య ఆరాధన

నకరికల్లు: చేజర్ల కపోతేశ్వరాలయంలో సోమవారం తుంగతుర్తి బుచ్చయ్య ఆరాధనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. దేవాలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు చేశారు.

### ఘనంగా ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం

మాచర్ల: ప్రపంచ ఫిజియోథెరపి దినోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల ఆధ్వర్యాన సోమవారం పట్టణంలోని సూర్యకిరణ్ దివ్యాంగుల పాఠశాలలో ఫిజియోథెరపి క్యాంపు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు తుమ్మల సత్యప్రసాద్ మాట్లాడు తూ పాఠశాలలోని 20మంది దివ్యాంగ చిన్నారులకు డీఎన్ఆర్ ఫిజియో క్లినిక్ ఆధ్వర్యాన వైద్య సేవలందించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రధానకార్యదర్శి కోటేశ్వరరావు, కోశాధికారి యనమదల వెంకట్రామయ్య, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కారంపూడి: ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యులు రమ్య, లక్ష్మీమౌనికలు అన్నారు. సోమవారం పట్టణంలోని ఇందిరాగాంధీ బొమ్మసెంటర్లో నిర్వహించిన మెడికల్ క్యాంపులో వారు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ గృహాల ముందు మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమ తెరలను తప్పనిసరిగా వాడాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మల్లయ్య, మస్తాన్‌వలి, లాలునాయక్, ఎంపీహెచ్‌వో జ్యోతి, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

### తహసీల్దార్ కరుణకుమార్‌కు సన్మానం

దుర్గి: మండల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన కరుణకుమార్‌ను సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో కూటమి నేతలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కూటమి నేతలు సొసైటీ చైర్మన్ కటక రామ్మోహనరావు, బీజేపీ నేతలు వెలిదండి శ్రీనివాసరావు, సింగు రవి, నక్కనబోయిన వెంకటేశ్వర్లు, శ్రీహరి, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు గోల్డెన్ స్టార్ అవార్డులు

విజయపురిసౌత్: స్థానిక ప్రభుత్వోన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం బిగ్‌హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యాన గోల్డెన్‌స్టార్ అవార్డులను అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జ్యోతి, ప్రాజెక్ట్ డైరెక్టర్ కోటేశ్వరరావు, రమేష్‌బాబు, లక్ష్మీ, ప్రసన్న, అనురాధ, జ్యోతి, ఉమ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా వేళాంగిణి మాత వార్షికోత్సవం

రెంటచింతల: పాలువాయి జంక్షన్లో ఉన్న శ్రీవేళాంగిణి మాత చర్చి వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. విచారణ గురువులు ఫాదర్ రత్నబాబు, లూర్థు మర్రెడ్డి సమిష్టి దివ్యపూజాబలి నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

### నగర పంచాయతీకి ఫాగింగ్ మిషన్ అందజేత

గురజాలటౌన్: గురజాల నగర పంచాయతీ పరిధిలోని కిరణా అసోసియేషన్ ఆధ్వర్యాన గురజాల నగర పంచాయతీకి ఫాగింగ్ మిషన్ అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులను కమిషనర్ శివన్నారాయణ సన్మానించారు.

### ప్రతి ఒక్కరు అక్షరాస్యులు కావాలి

పెదకూరపాడు: ప్రతిఒక్కరు అక్షరాస్యులై దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని జెడ్పీస్కూల్ హెచ్‌ఎం కె.వెంకటరమణ అన్నారు. పెదకూరపాడులోని జడ్పీహైస్కూల్‌లో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్లకార్డులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు నినాదాలు చేశారు.

### పాఠశాల వంట గదికి రూ.20వేల ఆర్థిక సాయం

అచ్చంపేట:మండలంలోని కోగంటివారిపాలెం ఎంపీపీ పాఠశాల వంట గది మరమ్మతుల కొరకు స్నేహ హస్తాల ఫౌండేషన్, ఉపాధ్యాయులు కలిసి రూ.20వేల చెక్కును ఎంఈవో ప్రసాదరావుకు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమాదేవిబాయి, సర్పంచ్ బోనం నాగిరెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ మేరీబాబు, ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ కరిముల్లాబాబు పాల్గొన్నారు.

### బెల్లంకొండలో వాహనాల తనిఖీ

బెల్లంకొండ: బెల్లంకొండలో సోమవారం ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అధిక లోడుతో వెళ్తున్న వాహనాలకు అపరాధ రుసుం విధించారు. తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ షణ్ముక్ పాల్గొన్నారు.

### నేత్ర వైద్య శిబిరానికి 220 మంది హాజరు

క్రోసూరు: క్రోసూరులోని ఏఈఎల్‌సీ చర్చి ఆవరణలో సోమవారం నిర్వహించిన నేత్ర వైద్య శిబిరానికి వివిధ కంటి వ్యాధులతో బాధపడుతున్న వారు 220మంది హాజరైనట్లు పాస్టర్ మాచర్ల సుందరరావు తెలిపారు. ఎల్‌వీ ప్రసాదు కంటి ఆస్పత్రి సౌజన్యంతో శిబిరం జరిగింది. మొత్తం 65మందిని ఆపరేషన్‌ల కోసం ఎంపికచేయగా 72మందిని కంటి అద్దాల కోసం ఎంపిక చేశారు. కార్యక్రమంలో రావూరి విజయ్‌మనోహర్ పాల్గొన్నారు.

### హసానాబాద్‌లో మసీదు నిర్మాణానికి శంకుస్థాపన

మండలంలోని హసానాబాద్‌లో నూతన మసీదు నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన జరిగింది. 14 సెంట్ల విస్తీర్ణంలో అల్హుద ట్రస్ట్ ఆధ్వర్యంలో మసీదు నిర్మాణం చేస్తున్నట్టు ట్రస్ట్ చైర్మన్ మౌలానా అబ్బాసస్ నబీ తెలిపారు.

### అన్నదాత పోరు కరపత్రాలు విడుదల

వైసీపీ ఆధ్వర్యంలో ఈనెల 9న జరగనున్న అన్నదాత పోరు కరపత్రాలను సోమవారం పార్టీ కార్యాలయం వద్ద విడుదల చేశారు. 9వ తేదీ ఉదయం 10 గంటలకు సత్తెనపల్లి ఆర్డీవో కార్యాలయం ఎదుట జరిగే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ నాయకులు కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చిలకా చంద్రయ్య, వెలది అప్పారావు, అన్నపురెడ్డి నర్సిరెడ్డి, జమీల పాల్గొన్నారు.

### గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

ఉరవకొండ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా ఉరవకొండ మండలం ఇంద్రావతి గ్రామ సమీపంలో హంద్రీనీవా కాల్వలో పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన నాగిరెడ్డి(28) ఆదివారం గల్లంతు కాగా.. మృతదేహం సోమవారం లభ్యమైంది. వజ్రకరూరు మండలంలోని పీసీ ప్యాపిలి సమీపం లోని హంద్రీనీవా కాల్వలో ప్రమాదవశాత్తు జారిపడి గల్లంతైన విషయం తెల్సిందే. ఇంద్రావతి సమీపంలోని కాల్వలో అతని మృతదేహం తేలుతుండగా.. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోలీసులు ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు.

## ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యం

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ


సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని టీడీపీ ప్రజావేదికలో సోమవారం నియోజకవర్గానికి చెందిన పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలు ఆరోగ్యం విషయాల్లో బాధ పడకూడదని, కూటమి ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా లబ్ధిదారులకు రూ.15.21 లక్షల విలువైన నగదు చెక్కులను ఎమ్మెల్యే పంపిణీచేశారు.

### స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలి

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరు పనిచేయాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని టీడీపీ ప్రజావేదికలో సోమవారం టీడీపీ పట్టణ కమిటీ సమావేశంలో కన్నా మాట్లాడుతూ నూతనంగా పార్టీ పదవులు పొందిన నాయకులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. పార్టీ అభ్యర్థులందరూ విజయం సాధించేలా ఇప్పటినుంచే ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నారు. ముందుగా ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ నేతలు నాగోతు శౌరయ్య, ఎలినేడి రామస్వామి, దరువూరి నాగేశ్వరరావు, మన్నవ శారదాదేవి, మస్తాన్‌వలి, నూర్ బాషా జానీబాబు, కంభాల వెంకటేశ్వరరావు, మక్కపాటి రామచంద్రరరావు, రవిచంద్ర, రాంబో బుడే, మారెళ్ళ మల్లేశ్వరరావు, బోడెంపూడి రాజేశ్వరి, బత్తుల నాగేశ్వరరావు, పట్టణానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## రియల్ ఎస్టేట్ వ్యాపారుల వద్ద డబ్బు తీసుకోలేదని ప్రమాణం చేస్తావా ?

● అంబటికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీచౌదరి సవాల్


మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరి

నకరికల్లు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లిలో వెంచర్లు వేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారుల వద్ద డబ్బులు తీసుకోలేదని దేవుని ఎదుట ప్రమాణం చేయగలవా? అని మాజీ మంత్రి అంబటి రాంబాబుకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరి సవాల్ విసిరారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ , ఏబీఎన్ ఎండీ రాధాకృష్ణ, వాస్తవాలను వెలికితీస్తున్న అన్ని మీడియా సంస్థల యాజమాన్యాలపై అంబటి అసభ్య పదజాలంతో అవాకులు, చవాకులు పేలుతున్నారన్నారు. సోమవారం నకరికల్లు మండలం కుంకలగుంటలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో మంత్రిగా ఉండి ఎలాంటి నిధులు తీసుకు రాలేదన్నారు. నకరికల్లులోని ఒక రైస్ మిల్లులో రేషన్ రీసైక్లింగ్ చేసి మంత్రి సజ్జలతో కలసి పోర్టుకు తరలించింది మీరు కాదా? అని ప్రశ్నించారు. గ్రావెల్ మైనింగ్‌తో రూ.కోట్లు సంపాదించింది అంబటి కాదా? అని అన్నారు. నరసింగపాడు వద్ద, కొండమోడు వద్ద మైనింగ్ చేసి అక్రమ సంపాదనకు తెరలేపింది అంబటేనని ఆరోపించారు. సంక్రాంతి సంబరాల పేరుతో టిక్కెట్లు అమ్ముకున్నది నీవు కాదా? అని అంబటి తీరును బాజీచౌదరి దుయ్యబట్టారు. నారా లోకేశ్ రెడ్‌బుక్ ద్వారా వైసీపీ అక్రమార్కుల గుండెల్లో రైళ్ళు పరిగెడుతున్నాయన్నారు. ఉపాధి పనుల్లో సత్తెనపల్లి నియోజకవర్గాన్ని అవినీతిలో అగ్రస్థానంలో నిలిపింది నీవు కాదా? అని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం విధానం వికాసమని.. వైసీపీ విధానం విధ్వంసం అన్నారు. లోకేశ్‌పైగాని, సీఎం చంద్రబాబుపై గాని, మీడియా సంస్థల ప్రతినిధులపై గాని, పిచ్చిపిచ్చిగా మాట్లాడితే అంబటికి తగిన బుద్ధి చెపుతామన్నారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకుండా వైసీపీ నేతలు జీతం తీసుకోవటం సిగ్గు చేటన్నారు. అంబటి పాపాల చిట్టాపై ప్రభుత్వం చట్టపరంగా చర్యలు తీసుకుంటుందన్నారు. వైసీపీ రైతుపోరుతో నిరసన కార్యక్రమాన్ని చేయటం సిగ్గుచేటన్నారు. ఎరువులను అన్ని చోట్ల అందుబాటులోకి తెచ్చి అన్నదాత సుఖీభవను అమలుచేసి కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతిగా వ్యవహరిస్తుందన్నారు. జగనన్న కాలనీల పేరుతో భూములను రూ 7 లక్షలకు కొనుగోలు చేసి ఎక్కువ మొత్తానికి ప్రభుత్వానికి అమ్మి సొమ్ము చేసుకుంది మీరు కాదా? అంబటి అని ప్రశ్నించారు. వైసీపీలోని వ్యక్తుల ఫిర్యాదు మేరకే అంబటిపై విజిలెన్స్ విచారణ జరుగుతుందని, తప్పు చేయనప్పుడు ఉలుకెందుకన్నారు.కార్యక్రమంలో మందపాటి మధుబాబు, సాతులూరి రామారావు, ఆసా పూర్ణయ్య, తాడువాయి వెంకటేశ్వర్లు, సాతులూరి రాంకోటయ్య, మాలపాటి సీతారామయ్య, వట్టికొంట వెంకటప్పయ్య పాల్గొన్నారు.

## యూరియా అవసరం మేరకే వినియోగించాలి

● ఏడీఏ శ్రీ కృష్ణ దేవరాయలు


మాచవరం: రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ శ్రీ కృష్ణ దేవరాయలు తదితరులు

మాచవరం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రైతులు అవసరం మేరకే యూరియాను పంటలకు వినియోగించుకోవాలని పిడుగురాళ్ళ ఏడీఏ శ్రీకృష్ణ దేవరాయలు రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని గంగిరెడ్డిపాలెం రైతుసేవా కేంద్రంలో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది యూరియా కొరత సృష్టిస్తున్నారని, ఇది గమనించిన రైతులు యూరియా దొరుకుతుందో లేదో అనే ఆందోళనలో అవసరం లేనప్పటికీ కొనుగోలు చేసి దాచిపెట్టుకుంటున్నారని, ఇది సరికాదన్నారు. యూరియా నిల్వలు పుష్కలంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో విష్ణు చిరంజీవి, ఏవో రామమ్మ, వ్యవసాయశాఖ సహాయకులు పాల్గొన్నారు. అనంతరం ఎంపీడీవో చిరంజీవి సచివాలయ రికార్డులను పరిశీలించి సూచనలు, సలహాలు తెలియజేశారు.

### అన్ని ఆర్ఎస్‌కేల్లో యూరియా పంపిణీ

● మండల ప్రత్యేక అధికారి ఝాన్సీరాణి

నకరికల్లు సెప్టెంబర్ 8 ఆంధ్రజ్యోతి: అన్ని రైతు సేవా కేంద్రాల్లో యూరియా పంపిణీ చేస్తున్నట్లు మండల ప్రత్యేక అధికారి ఝాన్సీరాణి తెలిపారు. సోమవారం ఆమె చల్లగుండ్ల లోని రైతు సేవా కేంద్రంలో రైతులతో మాట్లాడారు. యూరియాతో పాటు ఇతర కాంప్లెక్స్ ఎరువులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఏదైనా సమస్య ఉంటే కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన నంబర్‌కు ఫోన్‌చేసి ఎరువులు సమస్యపై మాట్లాడవచ్చన్నారు. సమావేశంలో ఏఓ కే దేవదాసు, పీఎస్ అబ్దుల్లా పాల్గొన్నారు.

### ఎంఆర్‌పీకి మించి అమ్మితే లైసెన్స్ రద్దు

● తహసీల్దార్ కే పుల్లారావు

నకరికల్లు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఎరువులను ఎంఆర్‌పీకి మించి ఎక్కువ ధరకు అమ్మినట్టు ఏ రైతు ఫిర్యాదు చేసినా లైసెన్స్ రద్దు చేసి చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కే పుల్లారావు అన్నారు. సోమవారం నకరికల్లులోని ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. యూరియా అన్నిచోట్ల అందుబాటులో ఉందని, రైతులు యూరియాను అవసరం మేర కొనుగోలు చేయాలని సూచించారు. డీలర్లు కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏవో దేవదాసు, వై ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

## ఎరువుల సరఫరాపై నిఘా పెట్టండి

● ఏఎంసీ సమావేశంలో సభ్యులు


మాట్లాడుతున్న చైర్మన్ వీరస్వామి, సభ్యులు

పిడుగురాళ్ళ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల వ్యవసాయ శాఖ సబ్‌డివిజన్ పరిధిలో ఎరువుల నిల్వలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడంతో పాటు రైతులకు యూరియా అందుబాటులోకి వచ్చేలా వ్యవసాయ అధికారులు తగిన నిఘా పెట్టాలని ఏఎంసీ చైర్మన్ తురకా వీరస్వామి తెలిపారు. సోమవారం ఏఎంసీ పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎరువులు సరఫరా అందుబాటులో వున్నప్పటికీ కొందరు రైతులు రెండో దశ వాడకం ఎరువులు కూడా ఇప్పుడే కొనుగోలుచేసి దాచుకోవడం వల్ల కృత్రిమకొరత ఏర్పడుతుందన్నారు. ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ పిడుగురాళ్ల కేంద్రంగా వున్న ఎరువుల దుకాణాలకు, మార్కెట్‌యార్డులో గోడౌన్‌కు రాజుపాలెం, కారంపూడి, నకరికల్లు, మాచవరం, పిడుగురాళ్ల మండలాలకు చెందిన రైతులు కూడా వస్తుండటం వల్ల కొంత ఇబ్బందిగా వుందని, రైతులు దయచేసి ఆయా మండలాల్లో అందుబాటులో వున్న సొసైటీలు, జీడీసీసీఎంఎస్ కేంద్రాల ద్వారా ఎరువులను తీసుకోవచ్చన్నారు. వ్యాపారులు కూడా ఎరువులకు కృత్రిమ కొరత సృష్టిస్తే షాపు లైసెన్స్ రద్దుతో పాటు కేసులు నమోదు చేస్తామన్నారు. ఇప్పటికే కొనుగోళ్లపై నిరంతరం నిఘా, చెక్‌పోస్టు ఏర్పాటుచేశామన్నారు. పిడుగురాళ్ల పీఏసీఎస్ అధ్యక్షుడు వడ్డవల్లి సర్వేశ్వరరావు మాట్లాడుతూ అధికారులు నానో యూరియా, డీఏపీ వాడకంపై అవగాహన కల్పించాలన్నారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ పల్వారి ధనుంజయ మృతిపట్ల సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు. ఇటీవల మృతిచెందిన మార్కెట్‌యార్డు వాచ్‌మెన్ రవి కుటుంబసభ్యులకు రూ.2లక్షల చెక్కును అందజేశారు. సమావేశంలో వైస్‌చైర్మన్ షేక్ మీరాసాహెబ్, సభ్యులు దూదేకుల ఖాశింబిసైదా, చల్లగుండ్ల రూబెన్, గరికపాటి విజయలక్ష్మీ, జక్కుల తిరుపతయ్య, నెక్కంటి భూలక్ష్మీ శ్రీను, పాదర్తి రాజేశ్వరి, పణితి ఇంద్ర, మార్కెట్ కమిటీ కార్యదర్శి ఈశ్వరరావు పాల్గొన్నారు.

### రేపు ఓర్వకల్లు చేపల చెరువుకు బహిరంగ వేలం

అచ్చంపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓర్వకల్లు గ్రామ పంచాయతీ పరిధిలో గల 156 ఎకరాల విస్తీర్ణం ఉన్న గంగమ్మ చెరువులో చేపలు వేసి పెంచుకొనే హక్కును బహిరంగ వేలం ద్వారా ఇస్తున్నట్టు గ్రామ కార్యదర్శి ఎంపీ నాయక్ సోమవారం తెలిపారు. సెప్టెంబరు 10న ఉదయం 11గంటలకు ఓర్వకల్లులోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో వేలం నిర్వహిస్తున్నామన్నారు.

### యూరియా ధరలను తగ్గించాలి

● సీపీఐ నేతల వినతి

కారంపూడి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): యూరియా ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లునాయక్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూరియా అక్రమ రవాణాపై ప్రత్యేక దళాలు ఏర్పాటు చేయాలన్నారు. మార్కెట్‌లో తనిఖీలు కఠినంగా జరపాలన్నారు. రైతులకు నేరుగా సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. వినతిపత్రం అందించిన వారిలో సీపీఐ మండల కార్యదర్శి షేక్ సైదా, సహాయ కార్యదర్శి మేకపోతు చిన కోటిరెడ్డి, ఇందూరు శ్రీను, గాలం శ్రీను, సుభాని తదితరులు ఉన్నారు.


తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నేతలు

## ప్రతి రైతుకు యూరియా అందేలా చర్యలు తీసుకోవాలి

దాచేపల్లి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతుకు యూరియా కట్టలు అందేలా చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు తహసీల్దార్ శ్రీనివాస యాదవ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. సీపీఐ నాయకులు మాట్లాడుతూ యూరియా కట్టలను బ్లాక్ మార్కెట్‌కు తరలించకుండా చూడాలని కోరారు. పురుగుమందులు నకిలీలు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతి పత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. వారిలో కొమెర వెంకటరావు, మురికపూడి చలువయ్య, తమ్మిశెట్టి శ్రీరాములు, తెలనాకుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పల్నాడు జిల్లాకు గుర్రం జాషువా పేరు పెట్టాలి

● ప్రజా సంఘాల నేతల వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ప్రజా సంఘాల నేతలు

మాచర్ల రూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాకు మహాకవి గుర్రం జాషువా పేరు పెట్టాలని ప్రజాసంఘాల నేతలు కోరారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ముందుగా పట్టణంలోని జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దళిత బహుజన సంక్షేమ సేవాసంఘం వ్యవస్థాపకుడు కుక్కమూడి ప్రసాద్, దళిత బహుజన భీమ్‌సేన రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు జార్జి, జాతీయ బహు కళాకారుల సంఘం వ్యవస్థాపకుడు జెట్టిపాలెం వెంకటేష్, గురజాల అప్పారావు, మరియదాసు, కడియం అన్నారావు, కర్రా చిన రంగయ్య, ఎంసీపీఐయూ డివిజన్ కార్యదర్శి ఎం.నాగేశ్వరరావు, కందుల రవికుమార్, పాషావలి, నాగెండ్ల వెంకటనారాయణ, మాచర్ల రామారావు, గురవయ్య, చెన్నకేశ్వర్లు పాల్గొన్నారు.

## ఉపాధి శిక్షణ, ఉద్యోగ అవకాశాల కల్పన

క్రోసూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ నిర్మూలన కోసం డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత ఉపాధి శిక్షణతోపాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్టు కో-ఆర్డినేటర్ అంజిరెడ్డి తెలియజేశారు. అభ్యర్థులు మంగళవారం నుంచి 20వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 10వ తరగతి పైబడి విద్యార్హతలు గల 15 నుంచి 45 సంవత్సరాల లోపు యువతీ యువకులందరూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటీవ్ డొమెస్టిక్ వాయిస్ కోర్సులో 60 మందికి, డొమెస్టిక్ ఐటీ హెల్ప్ డెస్క్ అటెండెంట్ కోర్సులో 60 మందికి, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ కోర్సులో 30మందికి అవకాశం కల్పిస్తామన్నారు. ట్రైనింగ్ కాలవ్యవధి 3నెలలు ఉంటుందని, అభ్యర్థులు ఆధార్ కార్డు, విద్యార్హత నకళ్లు, రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణ పూర్తయిన వెంటనే ఉద్యోగ అవకాశం కల్పించ బడుతుందని తెలిపారు.



## ఎరువుల కొరత లేదు: ఎమ్మెల్యే ప్రవీణ్


ఎమ్మెల్యే ప్రవీణ్

పెదకూరపాడు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతులకు ఎరువుల కొరత లేకుండా చూస్తుందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. గుంటూరులోని పెదకూరపాడు నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న దుష్ప్రచారాన్ని రైతులు నమ్మవద్దన్నారు. నియోజకవర్గంలో ఎక్కడా ఎరువుల కొరత లేదని, రైతుల సంక్షేమం గురించి పట్టించుకోని జగన్ ఇప్పుడు దుష్ప్రచారం చేస్తూ రైతులను ఆందోళనకు గురి చేయాలని ప్రయత్నిస్తున్నారన్నారు. జగన్‌రెడ్డి పాలనలో రైతులు తీవ్ర కష్టాలు పడ్డారని, ఎరువుల బ్లాక్ మార్కెట్, విత్తనాల మోసం, సాగునీటి కోసం రైతులు అల్లాడారన్నారు. అహర్నిశలు శ్రమిస్తున్న కూటమి ప్రభుత్వాన్ని విశ్వసించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విత్తనాలు, ఎరువులు, సాగునీరు, మద్దతు ధర అన్నింటినీ సమయానుకూలంగా రైతులకు అందేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారన్నారు.


మెడల్స్ సాధించిన విద్యార్థులతో పాఠశాల ప్రిన్సిపాల్ మధుసూదనరావు

## జాతీయ స్థాయి క్రీడలకు విద్యార్థుల ఎంపిక

దాచేపల్లి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు దాచేపల్లి మండలంలోని తంగెడ డీఏవీ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. సోమవారం పాఠశాల హెచ్‌ఎం మధుసూదనరావు తెలియజేస్తూ సెప్టెంబరు 5, 6 తేదీల్లో జీఎంఆర్ డీఏవీ విద్యార్థులు శ్రీకాకుళంలో జరిగిన పోటీల్లో తమ ప్రతిభను చాటారు. అండర్-14 బాలుర విభాగంలో 800 మీటర్ల రన్నింగ్‌లో వెంకటేష్ సిల్వర్, 1500 మీటర్ల రన్నింగ్‌లో బ్రాంజ్‌మెడల్, 14, 17 బాలుర విభాగంలో 4/100 మీటర్లలో 8మంది విద్యార్థులు బ్రాంజ్ మెడల్ సాధించారు. అండర్ - 17 కబడ్డీ బాలుర విభాగంలో మొదటి స్థానంలో రామ నాగశ్యామ్, నసీర్, దేవ కుమార్, లలిత విఘ్నేష్, మనోజ్‌కుమార్, జార్జ్, కార్తీక్ గోల్డ్‌మెడల్ కైవసం చేసుకున్నారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభచాటిన వీరంతా ఢిల్లీలో జరగబోయే పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను భవ్య సిమెంట్ ఎండీ ఎన్ వెంకటపతిరాజు, యూనిట్ హెడ్ బాబా పక్రుద్దీన్, డీఏవీ సౌత్ జోన్ ఏఆర్‌వో కే ఆనందవల్లి అభినందించారు.

## అమర కళాకారుల సంస్మరణ సభలు జరపాలి

సత్తెనపల్లి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి అమర కళాకారుల సంస్మరణ సభలు, ప్రజానాట్య మండలి సాంస్కృతిక సభలు నిర్వహించాలని ప్రజానాట్య మండలి సత్తెనపల్లి నియోజకవర్గ కార్యదర్శి వల్లెం చెన్నకేశవరావు అన్నారు. సోమవారం సీపీఐ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చెన్నకేశవరావు మాట్లాడుతూ ప్రజానాట్య మండలి అభ్యున్నతికి కృషి చేసిన కళాకారుల సంస్మరణ సభలు నిర్వహించటం ప్రజానాట్య మండలి కర్తవ్యం అన్నారు. సమావేశంలో కంభాల శ్రీనివాస్, డీఆర్ మస్తాన్, కోటేశ్వరరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

అమరావతి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): అమరేశ్వరాలయం సమీపంలోని జిల్లా పరిషత్‌కు చెందిన శాంతిధామం వసతిగృహంలో జరుగుతున్న పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. సిఐ అచ్చియ్య తమ సిబ్బందితో దాడి చేసి 19మంది జూదరులను అదుపులోకి తీసుకుని రూ.44,850 స్వాధీనం చేసుకున్నారు. కేసునమోదు చేసి కోర్టులో హాజరు పర్చనున్నట్లు సిఐ తెలిపారు.

## ఉపాధి శ్రామికులంతా అక్షరాస్యులు కావాలి

● ఎంపీడీవో కే సురేష్


నకరికల్లులో అక్షరాస్యత ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నకరికల్లు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకంలో పని చేసే ప్రతి ఒక్క శ్రామికుడు, శ్రామికురాలు అక్షరాస్యులు కావాలని ఎంపీడీవో కే సురేష్ కోరారు. సోమవారం అంతర్జాతీయ అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈనెల 1వ తేదీ నుంచి 8వరకు అక్షరాస్యత వారోత్సవాన్ని నిర్వహించారు. ఉల్లాస్ అక్షరాంధ్ర కార్యక్రమంలో భాగంగా అందరూ విద్యావంతులు కావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా పురుషులకు ఉపాధి హామి ఫీల్డ్ అసిస్టెంట్‌లు, మహిళలకు స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు చదవటం, రాయటం నేర్పించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ఏపీఎం సమాధానం, డిప్యూటీ ఎంపీడీవో కేవీఎస్ ప్రసాదు, ఏపీవో జీ ప్రసాదు, వయోజన విద్య సూపర్‌వైజర్ డీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ జట్ల ఎంపిక

రొంపిచర్ల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రొంపిచర్ల జడ్పీ పాఠశాల ఆవరణలో జిల్లా సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ ఎంపికలు సోమవారం జరిగాయి. బాలుర, బాలికల విభాగంలో జిల్లా నుంచి 150మంది క్రీడాకారులు పాల్గొన్నారు. బాలుర జట్టుకు 16మంది, బాలికల జట్టుకు 16 మందిని ఉమ్మడి జట్టుకు ఎంపిక చేశారు. జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ ఎంపికలు జరిగాయి. అక్టోబరు నెలలో వైజాగ్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ రెండు జట్లు పాల్గొంటాయని హెచ్‌ఎం సుభానీ తెలిపారు. కార్యక్రమంలో పీసీ కమిటీ చైర్మన్ ఏడుకొండలు, రిటైర్డు హెచ్‌ఎం రామకృష్ణారెడ్డి, 30 మంది ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ యువకుడు మృతి

పిడుగురాళ్ల, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పాతగణేశునిపాడు గ్రామానికి చెందిన పేర్ల రాంబాబు(21) గత నెల 26వ తేదీన పురుగుమందు తాగి గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్ఐ మోహన్ తెలిపారు. రాంబాబు హైదరాబాద్‌లో పనులకు వెళ్లి అక్కడ ఓ యువతిని ప్రేమిస్తున్నట్లు తెలియజేసినప్పటికీ ఆ యువతి నుండి సరైన సమాధానం రాకపోవడంతో మనస్తాపానికి గురైన రాంబాబు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు.

# శతమానం భవతి..!

● మంగళగిరి వైద్య ప్రదాయినిగా వంద పడకల ఆస్పత్రి
● అత్యాధునికి వసతులతో.. శరవేగంగా నిర్మాణ పనులు
● దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచేలా లోకేశ్ ప్రణాళిక

(ఆంధ్రజ్యోతి, మంగళగిరి):

మంగళగిరి ప్రజల మూడు దశాబ్దాల కల సాకారమవుతోంది. కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా... అత్యాధునిక సదుపాయాలతో వంద పడకల ఆసుపత్రి రూపుదిద్దుకుంటోంది. నగరంలోని చినకాకాని వద్ద జాతీయ రహదారి వెంబడి సుమారు 7.35 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఆసుపత్రి నిర్మాణ పనులు శర వేగంగా సాగుతున్నాయి. నియోజకవర్గ ప్రజలకు మంత్రి నారా లోకేశ్ ఎన్నిల హామీని నిలబెట్టుకుంటూ.. ఈ ఆసుపత్రి నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. రూ.47.50 కోట్ల వ్యయంతో జీ+1 భవన సముదాయంగా దీనిని నిర్మిస్తున్నారు. భవిష్యత్తులో అంతస్తులను పెంచుకునేందుకు వీలుగా ఫౌండేషన్‌ను పక్కాగా వేస్తున్నారు. 39 ఏళ్లుగా 30 పడకల ఆసుపత్రిగా ఉన్న మంగళగిరి తాలూకా ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. మంగళగిరి ఘాట్ రోడ్డు వెంబడి కొనసాగుతున్న ఆసుపత్రి కార్యకలాపాలను.. నూతన భవనం పూర్తి కాగానే అందులోకి మారుస్తారు. మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీల్లో మంత్రి లోకేశ్ నెరవేరుస్తున్న రెండవ హామీగా దీనిని చెప్పుకోవచ్చు. మొట్ట మొదటిదిగా సాగునీటి సమస్యను పరిష్కరించారు. పెదవడ్లపూడి హైలెవల్ చానల్ వద్ద అసంపూర్తిగా నిలిచిపోయిన ఎత్తిపోతల పథకానికి రూ.10 కోట్లకు పైగా నిధులను విడుదల చేయించి పూర్తిచేయించారు. రెండవదిగా వంద పడకల ఆసుపత్రిని నిర్మిస్తున్నారు.

**అత్యాధునికి వసతులు..**


ఆసుపత్రి భవన సముదాయం (ఊహా చిత్రం)

ఈ ఏడాది ఏప్రిల్ 13న ఈ ఆసుపత్రి భవన నిర్మాణానికి లోకేశ్ శంకుస్థాపన చేశారు. వచ్చే ఏప్రిల్‌కు దీనిని పూర్తి చేసి ప్రారంభోత్సవం జరుపుకునేలా పనులు యుద్ధప్రాతిపదికన సాగాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి నిర్మాణ వ్యయం రూ 47.50 కోట్లు కాగా, ఇంటీరియర్, ఆసుపత్రి తాలూకు సామగ్రి యావత్తూ కలిపి మరో రూ.50 కోట్లకు పైగా ఖర్చు కాగలదని అంచనా వేస్తున్నారు. అంటే ఈ ఆసుపత్రి రమారమి రూ.వంద కోట్లకు పైగా వ్యయంతో రూపుదిద్దుకుంటోంది. చినకాకాని క్యాన్సర్ ఆసుపత్రి స్థానంలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణం కొనసాగుతోంది. ఆసుపత్రి ప్రధాన ముఖ ద్వారం ఉత్తరంగా ఉండనుంది. జీ+1 భవన సముదాయం రూపంలో మొత్తం 1,23,632 చదరపు అడుగుల విస్తీర్ణంలో భవనాన్ని డిజైన్ చేశారు. ఈ ఆసుపత్రి దేశానికే ఓ రోల్ మోడల్‌గా నిలవాలని మంత్రి లోకేశ్ వైద్య ఆరోగ్యశాఖ, ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు.

**అనుబంధ భవనాలు ఇలా..**

మరో ఆరు అనుబంధ భవనాలను నిర్మిస్తున్నారు. ఇవన్నీ 5,511 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంటాయి. ఇందులో బయో మెడికల్ వేస్ట్ గది, మార్చురీ భవనం, రోగుల సహాయకుల గది, మెయిన్ ఫోల్డ్ గది, సెక్యూరిటీ బ్లాక్స్ అంబులెన్స్ కోసం షెడ్డు నిర్మిస్తున్నారు. మొత్తం ఆసుపత్రిలో ఇంచుమించుగా 25 మంది వరకు వివిధ విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉంటారు. ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్‌గా జనసేన నియోజకవర్గ అధ్యక్షుడు చిల్లపల్లి శ్రీనివాసరావు స్థానికుడే కావడంతో ఆయన ఈ ఆసుపత్రి నిర్మాణ పనుల పట్ల ప్రత్యేక శ్రద్ధను కనబరుస్తున్నారు. కచ్చితంగా ఏడాదిలోగా ఆసుపత్రి భవనాన్ని ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు.

ఆసుపత్రిలో మెడికల్, సర్జికల్, ఆర్థోపెడిక్, గైనిక్, జనరల్ మెడిసన్, జనరల్ సర్జన్ వంటి అన్నీ ముఖ్యమైన విభాగాలతో పాటు మూడు ఆపరేషన్ థియేటర్లు, డయాలిసిస్ సెంటర్, తలసేమియా వార్డు, డీ అడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు.


ప్రధాన భవనానికి సంబంధించిన ఫౌండేషన్ పనులు


ఆసుపత్రి భవనం ఏరియల్ వ్యూ..ఊహా చిత్రం

## ఆసుపత్రి ప్రధాన భవనమిలా...

ఆసుపత్రి రెండు రకాల భవంతులతో కూడి ఉంటుంది. ఒకటి ప్రధాన ఆసుపత్రి భవనం, రెండవది అనుబంధ భవనాలు. ప్రధాన ఆసుపత్రి భవనం జీ+1 గా.. 1,18,121 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంటుంది. ఇందులో మొదటి అంతస్తు (గ్రౌండు ఫ్లోర్) మొత్తం 58,577 చదరపు అడుగులతో నిర్మితమవుతోంది. ఇందులో ఎంట్రన్స్ లాబీ, ఓబీజీ అండ్ గైనిక్, కుటుంబ నియంత్రణ, పీడియాట్రిక్స్, డెంటల్ అండ్ స్కిన్ (ఓపీడీ), క్యాజువాలిటీ, ఎల్‌డీఆర్ యూనిట్, మెడికల్ అండ్ సర్జికల్, నేత్ర, సైక్రియాట్రీ (ఓపీడీ), రేడియాలజీ, ఫిజియోథెరపీ, ఐసీటీసీ అండ్ టీబీ సెంటర్, ఆయూష్ (ఓపీడీ), డైక్, కిచెన్ అండ్ స్టోర్, పెథాలజీ, సెంట్రల్ ల్యాబ్, సెంట్రల్ ఫార్మసీ, ఆర్థోపెడిక్ (ఓపిడి), రిజిస్ట్రేషన్, ఎలక్ట్రికల్ రూం, తలసేమియా వార్డు, డయాలిసిస్, డాక్టర్స్ లాంజ్ అండ్ స్టాఫ్ లాంజ్ ఏర్పాటవుతాయి. రెండవ అంతస్తులో ఓటీ కాంప్లెక్స్, ఒక్కోటి 15 పడకలతో కూడిన ఆరు వార్డులు, జనరల్ సర్జరీ, జనరల్ మెడిసన్, ఓబీజీ, గైనకాలజీ, పెడియాట్రిక్స్, ఆర్థోపెడిక్, ఎంఎన్‌సీ వార్డు, ఎస్ఎన్‌సీయూ అండ్ ఎన్ఐసీయూ వార్డులు, క్రిటికల్ కేర్ యూనిట్లు, ఎన్‌బీఎస్‌యూ అండ్ స్టోర్స్, ఐసోలేషన్ వార్డు, పే రూములు (5), పరిపాలన విభాగం, బ్లడ్ స్టోరేజి తదితర విభాగాలను ఏర్పాటు చేస్తారు. ఇవిగాక టెర్రస్ ఫ్లోర్‌లో మరో 3,119 చదరపు అడుగుల విస్తీర్ణం అందుబాటులో ఉంటుంది.

---

### మండు టెండలతో..
## విద్యుత్ వినియోగం పైపైకి..

● రోజువారీ కోటాను దాటుతున్న విద్యుత్ వాడకం

గుంటూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రోజురోజుకు పెరుగుతోన్న మండుటెండలు ఏప్రిల్, మే నెలలను తలపిస్తున్నాయి. మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో విద్యుత్ వినియోగం పీక్‌కి చేరుతోంది. సాధారణ కోటా కంటే అదనంగా విద్యుత్ వాడకం జరుగుతోందని అధికారులు గణాంకాలతో తెలియజేస్తున్నారు. గుంటూరు సర్కిల్ పరిధిలోని గుంటూరు, తెనాలి డివిజన్‌లలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోంది. గత నెలలో 6 మిలియన్ యూనిట్ల వినియోగం లోపల మాత్రమే ఉంటే.. ఇప్పుడు దాని మించి వినియోగం జరుగుతోంది. వాస్తవానికి విభజిత గుంటూరు సర్కిల్‌కు రోజువారీ కోటాగా 6.008 మిలియన్ యూనిట్లు కాగా 6.426 మిలియన్ యూనిట్లు వినియోగిస్తున్నట్లు గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ చల్లా రమేష్ తెలిపారు. అలానే గుంటూరు సర్కిల్‌తో పాటు బాపట్ల, పల్నాడు సర్కిల్స్‌లో కూడా అదే స్థాయిలో విద్యుత్ వినియోగం పెరుగుతోందని అధికార వర్గాలు తెలిపాయి. ఎండలతో ప్రధానంగా మధ్యాహ్నం, రాత్రిళ్లు వాడకం అధికంగా ఉంటోందని చెబుతున్నారు. అసలే మండుతోన్న ఎండలు ఉక్కపోతతో ఊపిరాడక చిన్నారుల నుంచి పెద్దల వరకు అల్లాడిపోతున్నారు. దాంతో ఫ్యాన్లు, ఏసీలకు, ఎయిర్ కూలర్లను ఎడా పెడా వాడుతోన్నారు. తాజాగా విద్యుత్ వినియోగం చూస్తుంటే సమ్మర్ సమయంలో విద్యుత్ వినియోగం జరిగినట్లుగా ఉందని అధికారులు చెబుతున్నారు. విద్యుత్ వినియోగం పీక్ స్థాయిలో ఉండటంలో అక్కడక్కాడా విద్యుత్ సరఫరాలో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్న ఫిర్యాదులు వస్తున్నాయి. అర్ధరాత్రులు, మధ్యాహ్నం సమయాల్లో ఉన్నట్టుండి విద్యుత్ సరఫరాలో అంతరాయాలు రావడం కూడా పెరిగాయని చెబుతున్నారు. విద్యుత్ వినియోగం పెరిగిన నేపథ్యంలో సెక్షన్ స్థాయిలో అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు ఎస్ఈ రమేష్ తెలిపారు.

---

### వందశాతం..
## మెయిల్/ఎక్స్‌ప్రెస్ రైళ్ల సమయపాలన

● ఐదు నెలల్లో 14 రోజుల పాటు సాధించి.. రికార్డు
● గుంటూరు ఆపరేటింగ్ విభాగానికి అభినందనల వెల్లువ

గుంటూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మెయిల్/ఎక్స్‌ప్రెస్ రైళ్లను గత ఐదు నెలల్లో 14 రోజుల పాటు 100 శాతం సమయపాలనతో నడిపి గుంటూరు రైల్వే డివిజన్ ఆపరేటింగ్ విభాగం సరికొత్త రికార్డుని సృష్టించింది. డివిజన్‌లో కొంతభాగం సింగిల్ లేన్ రైలు మార్గం ఉన్నప్పటికీ ఆ అవరోధాన్ని అధిగమించి.. తనకు కేటాయించిన టైం షెడ్యూల్‌లో రైళ్లను నడిపింది. నిర్ణీత సమయానికి ఇటు వైపున తెనాలి, కృష్ణా కెనాల్, అటువైపున పగిడిపల్లి, నంద్యాల ఛేంజ్ వోవర్ల వద్ద ఇతర డివిజన్లకు రైళ్లను అప్పజెప్పింది. దీనిపై గుంటూరు ఆపరేటింగ్ విభాగం అధికారులు, సిబ్బందిని డివిజనల్ రైల్వే వర్గాలు, రైల్వే యూజర్స్ అసోసియేషన్ నాయకులు అభినందిస్తున్నారు.

● దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో ఏఏ డివిజన్‌లు 100 శాతం సమయపాలన సాధించాయనే వివరాలను విడుదల చేసింది. పొరుగున ఉన్న గుంతకల్లు డివిజన్ కేవలం ఐదు రోజులు మాత్రమే ఈ లక్ష్యాన్ని సాధించగా గుంటూరు రైల్వే డివిజన్ ఏప్రిల్‌లో 9, 22, మేలో 11, 12, జూన్‌లో 13, జూలైలో 7, 9, 13 ఆగస్టులో 4, 6, 21, 24, 25 29 తేదీల్లో తనకు కేటాయించిన షెడ్యూల్ ప్రకారం మెయిల్/ఎక్స్‌ప్రెస్ రైళ్లను గమ్యస్థానాలకు చేర్చింది. ఇతర డివిజన్‌లలో చాలా వరకు డబుల్ లేన్ రైలు మార్గాలున్నాయి. గుంటూరు డివిజన్‌కు వచ్చేసరికి తెనాలి - రేపల్లె, నల్లపాడు - పగిడిపల్లి, పిడుగురాళ్ల - వినుకొండ మధ్యన సింగిల్ లేన్ ట్రాక్‌లున్నాయి. అయినప్పటికీ ఈ అడ్డంకులను ఆపరేటింగ్ విభాగం అధిగమించింది.

● ప్యాసింజర్ రైళ్ల విషయంలోనూ గుంతకల్లు డివిజన్ నూరు శాతం సమయపాలన సాధించడం వలన ఆ డివిజన్ టాప్‌లో నిలిచింది. గుంటూరు డివిజన్ విషయానికి వచ్చేసరికి ప్యాసింజర్ రైళ్లను నిర్ణీత వ్యవధిలో గమ్యస్థానాలకు చేర్చలేకపోయింది. ఇందుకు కారణం సింగిల్ లేన్ ట్రాక్‌లో ఎదురుగా వచ్చే ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్టు రైళ్ల కోసం ప్యాసింజర్ రైళ్లను లూప్‌లైన్‌లో పెట్టాలి. అలానే వెనక వచ్చే ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ప్రిసిడెన్స్ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ కారణంగా ప్యాసింజర్ రైళ్ల విషయంలో సమయపాలన లక్ష్యాన్ని అధిగమించలేకపోయింది.

---

## 14 క్రస్ట్‌గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల


14 క్రస్ట్ గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

విజయపురిసౌత్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి వరద నీరు అధికంగా వచ్చి చేరుతుండడంతో నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ అధికారులు 14 క్రస్ట్‌గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం సోమవారం నాటికి 589.20 అడుగులు ఉంది. ఇది 309.65 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,700, ఎడమ కాలువ ద్వారా 9,166, 14 క్రస్ట్‌గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 1,12,224, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,658, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,400, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో 1,67,448 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో 1,67,448 క్యూసెక్కులుగా ఉంది.

### పులిచింతలకు 1,23,369 క్యూసెక్కుల నీరు

రెంటచింతల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జున సాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్ట్‌కు చెందిన 20 రేడియల్ క్రస్ట్‌గేట్లకు గాను.. 9 గేట్లను 2.50 మీటర్ల మేర ఎత్తి పులిచింతలకు 1,15,317, విద్యుత్ ఉత్పత్తి అనంతరం టెయిల్ రేస్ ఛానల్ ద్వారా 8052, మొత్తంగా 1,23,369 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈ సుబ్రహ్మణ్యం తెలిపారు. సాగర్ నుంచి 1,45,882 క్యూసెక్కుల నీరు వస్తున్నాందన్నారు. ఆదివారం అర్ధరాత్రి 12 గంటల వరకు 0.8242 ఎంయూల విద్యుత్ ఉత్పత్తి అయ్యిందని తెలిపారు. రిజర్వాయర్‌లో 75.48 మీటర్ల మేర నీరు ఉండగా ఇది.. 6.963 టీఎంసీలకు సమానమన్నారు.

### ప్రకాశం బ్యారేజ వద్ద పెరిగిన వరద ఉధృతి


బ్యారేజ దిగువకు విడుదల అవుతున్న వరద నీరు

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి పెరిగింది. పులిచింతల ప్రాజెక్టుతో పాటు కీసర, మున్నేరు, వెలగలేరు, తదితర ప్రధాన వాగుల నుంచి 1,45,714 క్యూసెక్కుల వరద నీరు సోమవారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్టు ఇరిగేషన్ శాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం నమోదు అవుతుండగా దిగువకు 1,26,975 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు డెల్టా కాలువకు 10,276, పశ్చిమ డెల్టాకు 8,216, గుంటూరు ఛానల్‌కు 247 క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నారు.

---

### కూటమి 'బీమా'..
## ఆరోగ్యానికి ధీమా..!

సత్తెనపల్లి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన యూనివర్శల్ హెల్త్ పాలసీతో పేదల వైద్య కష్టాలు తీరనున్నాయి. ఈ పాలసీతో పేద, మధ్య తరగతి ప్రజలు కార్పొరేట్ ఆస్పత్రి మెట్లెక్కేందుకు అవకాశం కలగనుంది. ప్రతి కుటుంబానికి రూ.25 లక్షలు ఆరోగ్య బీమా వర్తించేలా రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించింది. ఈ సొమ్ముతో 3,257 చికిత్సలు ఉచితంగా పొందేందుకు అవకాశం కలుగుతుంది. ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికి ఆరోగ్య బీమా దక్కనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌టీఆర్ వైద్య సేవా పథకం ద్వారా రూ.2.50 లక్షలు, కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ ద్వారా రూ.5 లక్షలు వైద్య ఖర్చులకు అందిస్తోంది. ఇంతకు మించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఇప్పటి వరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వైద్య సేవలన్నీ దారిద్రరేఖకు దిగువున ఉన్న కుటుంబాలకు మాత్రమే అందేవి. ఇది కూడా కొన్ని రకాల వ్యాధులకు మాత్రమే. కూటమి ప్రభుత్వం తీసుకు వచ్చిన పాలసీలో అన్ని రకాల చికిత్సలు ఉన్నాయి. వర్కింగ్ జర్నలిస్టులనూ ఇందులో చేర్చారు. అన్ని వర్గాలకు హెల్త్ పాలసీని వర్తింపజేయనున్నారు.

**ఆరు గంటల్లోనే వర్తింపు**

సాధారణ జ్వరంతో ఆస్పత్రికి వెళ్తే.. డాక్టర్ ఫీజు, మందులు, రక్త పరీక్షలతో కనీసం రూ.5వేలు ఐనా ఖర్చు అవుతుంది. ఇక ఆపరేషన్‌లకు ఐతే రూ.లక్షల్లోనే ఆ ఖర్చు ఉంటుంది. ఆస్పత్రిలో ఉండేందుకు గదికి రూ.3వేలు నుంచి రూ.10వేలు వరకు అద్దె వసూలు చేస్తున్నారు. రోగితో మాట్లాడిన తరువాత చీటి పై రాసిన పరీక్షలకు రూ.5వేలు నుంచి రూ.20వేలు వరకు ఖర్చు చేస్తున్నారు. వ్యాధి నిర్ధారణ తరువాత అయ్యే ఖర్చు చెప్పలేం. కుటుంబానికి జీవనాధార మైన ఇంటి పెద్ద అర్ధంతరంగా మంచం పట్టడమో, ప్రాణాలు కోల్పోవడమో జరిగితే.. ఆ కుటుంబం వీధినపడినట్లే.. వైద్య ఖర్చులకే లక్షలాది రూపాయలు ఖర్చు చేయలేక పేద, మధ్య తరగతి ప్రజలు చితికి పోతున్నారు. ఇప్పుడు ప్రతి పది మందిలో ముగ్గురు షుగర్, బీపీ వ్యాధితో బాధ పడుతున్నారు. రెండు వ్యాధులు ఉన్న వారు వివిధ రకాల పరీక్షలు చేయించుకోవాలి. దీర్ఘ కాలిక వ్యాధులు కావడంతో.. చికిత్సకు మందులు వాడాల్సి వస్తుంది. పిల్లల చదువుకు ఖర్చుతో పాటు అనారోగ్యానికి గురైతే రూ.లక్షల్లో ఖర్చు చేయాల్సి వస్తుంది. సంపాదించిన దానిలో సగం ఆస్పత్రులకు పోస్తున్నారు. ఈ పరిస్థితిని తప్పించేందుకు కూటమి ప్రభుత్వం రూ.25 లక్షల బీమాను తీసుకొస్తోంది. ఆస్పత్రిలో చేరిన ఆరు గంటల్లోపే హెల్త్ పాలసీ అమల్లోకి వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

---

# ఉద్యాన వికాసం.. రాయితీ సహకారం!

● ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం పోత్సాహం
● ఉపాధి హామీ పథకం అనుసంధానంతో.. ఆర్థిక తోడ్పాడు
● ఐదేళ్లకు ప్రణాళిక...క్షేత్రస్థాయిలో అవగాహన
● ఔత్సాహిక రైతుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం


నిమ్మతోట రైతులకు సూచనలు ఇస్తున్న అధికారి(ఫైల్‌పాటో)

వేమూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఉద్యాన పంటల సాగుకు అనేక విధాలుగా ఐదేళ్ల సాయం అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. కేంద్ర ప్రభుత్వ పథకాన్ని అనుసంధానం చేసి రైతులకు లబ్ధి చేకూర్చే విధంగా రాయితీలను ఇప్పటికే ప్రకటించింది. ఉపాధి హామీ పథకం ద్వార ఆర్థిక సాయం అందించేందుకు శ్రీకారం చుట్టింది. మొక్కలను తక్కువ ధరకు అందించడంతో పాటు ఖర్చులను కొంతమేర భరించనుంది. దీంతో రైతు తక్కువ ఖర్చుతో పంటలు పండించే వెసులుబాటు ఏర్పడింది. మొక్కలు, యంత్రాలు సరఫరా చేయడంతో పాటు తీగ మొక్కలకు పందిళ్ల ఏర్పాటు, పండ్లు, కాయల రవాణా కోసం.. సోలార్ డ్రైయర్స్, ప్యాకింగ్ ప్యాకెట్‌లను కూడా అందిస్తోంది. నిమ్మతోటల పునరుద్ధరణకు ప్రోత్సాహకాలు, సాగు పద్ధతులపై రైతులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం ప్రారంభించింది. ఉపాధి నిధుల నుంచి అర్హులైన రైతులకు పండ్ల తోటల పెంపకం కోసం వంద శాతం రాయితీ అందిస్తోంది. వీటిపై సచివాలయాల్లోని ఉద్యాన శాఖ ఉద్యోగుల ద్వారా విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తోంది. తద్వారా ఇప్పటికే తగిన సౌకర్యం ఉన్న అనేక మంది రైతులు ఉద్యాన పంటల సాగుకు ముందుకు వస్తున్నారు.

### రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

ఉద్యాన పంటల సాగుకు సంబంధించిన రాయితీలు పొందేందుకు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఉద్యాన శాఖ వేమూరు నియోజకవర్గ అధికారి కల్యాణ చక్రవర్తి తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా రాయితీలు పొందేవారు మండల పరిషత్ కార్యాలయాల్లో ఉపాధి విభాగం అధికారులను సంప్రదించాలన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో పలువురు రైతులు రాయితీలను అందుకుని.. పూల తోటలు, కూరగాయల పందిళ్లు, పసుపు, బొప్పాయి, అరటి, నిమ్మ ఇతర కూరగాయల పంటల సాగు ప్రారంభించారని తెలిపారు. గ్రామ సచివాలయాల పరిధిలో ఉద్యానవన శాఖ విభాగాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, నిబంధనల మేరకు రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

### ఉద్యాన పంటలపై రాయితీలు ఇలా..

- పసుపు విత్తనం నాటుకునేందుకు ఎకరాకు రూ.9,800 రాయితీ సొమ్మును రైతుల బ్యాంకు ఖాతాకు జమ చేస్తుంది.
- టిష్యూ కల్చర్ రెండేళ్ల కాల పరిమితితో అరటి మొక్కలు నాటుకునేందుకు రెండున్నర ఎకరాకు రూ.70 వేలు చొప్పున రాయితీ కల్పిస్తోంది. హైదరాబాద్, అనంతపూర్, వైఎస్సార్ యూనివర్శిటీల ద్వారా మొక్కలను సరఫరా చేస్తోంది.
- బొప్పాయి పంటలు వేసే రైతులకు రెండున్నర ఎకరాలకు రూ.28 వేలు రాయితీ అందిస్తోంది.
- హైబ్రీడ్ కూరగాయల పెంపకానికి రెండున్నర ఎకరాలకు రూ.24 వేల రాయితీ ఇస్తోంది. ఇదే విధంగా పూల తోటల పెంపకానికి రూ.20 వేలు రాయితీని ప్రకటించింది.
- తీగ జాతి కూరగాయల పెంపకానికి.. శాశ్వత పందిళ్ల నిర్మాణం కోసం రెండున్నర ఎకరాలకు రూ.2.50 లక్షల రాయితీ ఇవ్వనుంది.
- సోలార్ డ్రైయర్స్ 100 కేజీల కెపాసిటీ కలిగిన ఒక స్ట్రక్చర్‌కు రూ.3.50 లక్షలు ఖర్చు అవుతుంది. ఇందుకు రూ.1.50 లక్షలు రాయితీని అందించనుంది.
- పొలంలోని కాయలను రవాణా చేసే ముందు ప్యాకింగ్ గ్రేడింగ్, వాషింగ్ నిమిత్తంగా రూ.4.50 లక్షలు విలువ కలిగిన ప్యాకెట్‌ను రూ.2.50 లక్షల రాయితీపై సరఫరా చేయనుంది.

రాయితీపై వేసిన పసుపు అంతర్ పంటగా బొప్పాయి


- యాంత్రీకరణ ద్వారా రూ.10 వేలు విలువ కలిగిన బ్యాటరీ స్ప్రేయర్లను రూ.5 వేల రాయితీకి ఇవ్వనుంది. రూ.20 వేలపైన విలువ కలిగిన మోటార్ ఇంజన్లకు రూ.10 వేలు రాయితీ ప్రకటించింది.
- ఉపాధి నిధుల ద్వారా 14 రకాల పంటలు పండించేందుకు 100 శాతం రాయితీ కల్పించింది.
- నిమ్మ తోటల పునరుద్ధరణ పథకం ద్వారా బాగా దెబ్బతిన్న, చనిపోయిన నిమ్మ మొక్కల స్థానంలో కొత్త వాటిని నాటుకునేందుకు ఎకరాకు రూ.9,800 రాయితీ ఇవ్వనుంది.

---

# స్వర్ణ పంచాయతీకి శ్రీకారం!

● గ్రామాల్లో ఇంటి పన్ను వివరాల డిజిటలైజేషన్
● కొలిక్కి వస్తున్న ఆన్‌లైన్ ప్రక్రియ
● యాప్‌లో ఎడిట్ ఆప్షన్లపై యంత్రాంగం కసరత్తు
● నిధుల మళ్లింపునకు ఇక చెక్!

(బాపట్ల, ఆంధ్రజ్యోతి):

పంచాయతీకి పన్నుల రూపంలో వస్తున్న రాబడి ఎంత? వివిధ పనుల కోసం ఖర్చుపెడుతున్నది ఎంత?.. అనే వివరాలు ఇన్ని రోజులు బేతాళ రహస్యం గానే మిగిలిపోయాయి. జవాబుదారీ తనానికి అవకాశం లేకుండా ప్రక్రియలో ఉన్న లొసుగులను ఆసరాగా చేసుకుని ఇష్టారీతిన పంచాయతీ నిధులను కైంకర్యం చేసిన దాఖలాలు కోకొల్లలు. తిలా పాపం తలా పిడికెడు అన్న చందాన ఈ వ్యవహారాల్లో పంచాయతీ సిబ్బంది మొదలుకుని సర్పంచ్‌ల వరకు అందరి భాగస్వామ్యంతోనే అవకతవకలు జరిగేవి. తాము ఇంటి పన్ను సరిగానే చెల్లిస్తున్నట్లు యజమానులు చెబుతుంటే.. ఆ నిధులు మాత్రం పంచాయతీ ఖాతాల్లో కనిపించేవి కావు. అనేక పంచాయతీల్లో ఈ నిధులు దారి మళ్లాయి. కొన్ని చోట్ల విచారణ జరగ్గా అక్రమాలు నిజమని నిరూపితమవడంతో పంచాయతీ సిబ్బందిపై చర్యలు, సర్పంచ్‌ల చెక్ పవర్ రద్దు నిర్ణయాలు కూడా జిల్లాలో గతంలో తీసుకోవడం జరిగింది. కానీ, ఈ చర్యలేవీ నిధుల అవకతవకలకు అడ్డుకట్ట వేయలేకపోయాయి. వీటన్నింటికి విరుగుడుగా గ్రామాల్లో ఇంటి పన్ను వివరాలు మొదలుకుని, పంచాయతీ పరిధిలో ఖర్చు పెట్టే ప్రతి పైసా.. వివిధ పథకాల ద్వారా వచ్చే నిధులు మొత్తం ఇక నుంచి ఆన్‌లైన్‌లో నమోదు జరిగేలా ప్రభుత్వం స్వర్ణ పంచాయతీ విధానాన్ని తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఇంటి పన్ను ఆన్‌లైన్ చేయడంతో పాటు యజమాని ఆధార్ అనుసంధానం కూడా ఈ విధానంలో చేస్తున్నారు. ఇకపై ఇంటి పన్నును ఆన్‌లైన్‌లోనే చెల్లించే వెసులుబాటును ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ మొత్తం ప్రక్రియ ప్రారంభమై రెండు నెలలు కాగా ఇప్పటికి దాదాపు 90 శాతం డిజిటలైజేషన్ పూర్తి అయినట్లు సమాచారం. స్వర్ణ పంచాయతీ యాప్‌లో ఎడిట్ ఆప్షన్లకు సంబంధించి కొంత కసరత్తు మిగిలి ఉందని.. త్వరలోనే పూర్తి స్థాయిలో దీని వినియోగానికి శ్రీకారం చుట్టడం జరుగుతుందని డీపీవో ప్రభాకరరావు తెలిపారు



పర్చూరు మండలంలోని నాగులపాలెం పంచాయతీ కార్యాలయం

**దారిమళ్లిన పంచాయతీ నిధులు..**

బాపట్ల జిల్లా వ్యాప్తంగా 459 పంచాయతీలు ఉండగా ఇంటి పన్నుకు సంబంధించి ఏటా ఆదాయం దాదాపు రూ.19 కోట్ల వరకు పంచాయతీ ఖాతాలకు జమ కావాల్సి ఉంది. కానీ గడచిన ఐదేళ్ల ఏలు బడిలో 50 శాతం నిధులు కూడా జమ కాకపోగా నిధులు ఇష్టారీతిన దారి మళ్లించారు. తాము ఇంటి పన్ను కట్టి రశీదు తీసుకున్నప్పటికీ, రికార్డుల్లో కట్టలేదని చూపిస్తున్నారనే ఫిర్యాదులు వైసీపీ ఏలుబడిలో దాదాపు 800 వరకు వచ్చాయి. పెండింగ్ ఉన్నదెంత, వాటి వసూలుకు చేపడుతున్న చర్యలేంటి . ఇలా దేనికీ పంచాయతీల వద్ద సమాధానం ఉండేది కాదు. ప్రభుత్వం తీసుకొస్తున్న స్వర్ణ పంచాయతీల విధానంతో ఇక ముందు ఆన్‌లైన్‌లో పూర్తి పారదర్శకంగా వివరాలు లభించనున్నాయి. పంచాయతీల పరిధిలో ఇంటి పన్నుల రూపంలో వసూలు కావాల్సింది, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న బకాయిల వివరాలు ఇలా సమగ్రంగా యాప్ వేదికగా దర్శనమివ్వనున్నాయి

**90 శాతం ప్రక్రియ పూర్తి**

ఇంటి పన్ను వివరాల డిజిటలైజేషన్‌తో పాటు ఆధార్ అనుసంధాన ప్రక్రియ జిల్లా వ్యాప్తంగా 90 శాతం పూర్తి కాగా సాంకేతికపరమైన చిక్కులతో కొన్ని పంచాయతీల్లో ప్రక్రియ ఇంకా కొలిక్కి రాలేదు. వాటి విషయంలో ఉన్నతాధికారులకు ఆదేశాల మేరకు నడుచుకుంటామని యంత్రాంగం చెబుతోంది. త్వరలోనే స్వర్ణ పంచాయతీ యాప్ వేదికగా డిజిటల్ లావాదేవీలకు శ్రీకారం చుట్టనున్నారు. ఇంటి పన్ను మొదలుకుని పంచాయతీకి చెల్లించే మొత్తాలన్నీ ఇకపై నగదు రూపంలో కాకుండా ఆన్‌లైన్ ద్వారానే జరిపేలా ప్రజలకు అవగాహన కూడా కల్పించనున్నారు. ఈ యాప్ ద్వారా ప్రజలు నేరుగా తాము చెల్లించిన పన్ను ప్రభుత్వ ఖాతాకు జమ అయిందా లేదా అనే వివరాలు చూసుకోవచ్చని, ఏమైనా అభ్యంతరాలుంటే స్వర్ణ పంచాయతీ యాప్‌లోనే ఫిర్యాదు చేసే విధంగా అవకాశం కల్పించారు. ప్రస్తుతం వీటికి సంబంధించి ఎడిట్ ఆప్షన్లపై కసరత్తు జరుగుతోంది. త్వరలోనే యాప్ సేవలు అందుబాటులోకి రానున్నాయి.

**అవకతవకలకు చెక్ పడేనా..**

జిల్లా వ్యాప్తంగా దాదాపు 18 పంచాయతీల్లో గత ప్రభుత్వంలో అడ్డగోలుగా నిధుల దుర్వినియోగం జరిగినట్లు నిగ్గు తేల్చిన జిల్లా పంచాయతీ విభాగం ఇటీవలే ఆరుగురు పంచాయతీ కార్యదర్శులపై వేటు వేయడంతో పాటు ఇద్దరు సర్పంచ్‌ల చెక్ పవర్‌ను కూడా రద్దు చేసింది. త్వరలోనే మరికొంత మందిపై వేటు పడనుందని సమాచారం. పంచాయతీల్లో జరిగే లావాదేవీల్లో 90 శాతం ఆన్‌లైన్ వేదికగానే జరిగేలా చూడడమే స్వర్ణపంచాయతీల ప్రధాన ఉద్దేశ్యమని, తద్వారా నిధుల దుర్వినియోగానికి చెక్ పడనుందని ప్రభుత్వం చెబుతోంది.

## పొగాకు ఉత్పత్తుల వాడకానికి వ్యతిరేకంగా ర్యాలీ

రొంపిచర్ల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపాలెంలోని పీఎం శ్రీ ఏపీ మోడల్ పాఠశాలలో సోమవారం పొగాకు ఉత్పత్తుల వాడకానికి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. విద్యార్థులు చేసిన నినాదాలు గ్రామస్థులను ఆలోచింప చేశాయి. గ్రామంలో మానవహారం ఏర్పాటు చేశారు. పొగాకు తీసుకోవటం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ప్రిన్సిపల్ రవినాయక్ మాట్లాడుతూ పొగాకు ఏ రూపంలో తీసుకున్నా హాని కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



### క్లుప్తంగా...

● రొంపిచర్ల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లోని ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆదివారం రాత్రి గ్రహణం సందర్భంగా ఆలయాలను మూసివేసి, మరుసటి రోజు ఆలయాలను శుద్ధిచేసి పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

● చిలకలూరిపేట: చిలకలూరిపేట మునిసిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని తెలిపారు. పలు అంశాలపై నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు.

● చిలకలూరిపేట: వైసీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి, నియోజకవర్గ ఇన్‌చార్జి విడదల రజని అన్నదాత పోరు - రైతన్నకు బాసటగా పోస్టర్లను ఆవిష్కరించారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆమె విమర్శించారు.

● చిలకలూరిపేట: స్థానిక పండరీపురంలోని బీఆర్‌జీ మున్సిపల్ హైస్కూల్‌ను మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా సందర్శించారు. మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. యార్డు వైస్ చైర్మన్ పిల్లి కోటి, వార్డు కౌన్సిలర్ రాయని హరిత పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలు, బకాయిలు విడుదల చేయాలని ఎస్టీయూ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిలకలూరిపేట మండల శాఖ ఆధ్వర్యంలో సంఘం సభ్యత్వ నమోదు సేకరించారు. పాఠశాల విద్యాశాఖ మూల్యంకన విధానంలో లోపాలను సరిచేయాలని ఎస్టీయూ నాయకులు పోటు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

● చిలకలూరిపేట: పట్టణంలోని కళామందిర్ సెంటర్ ఎన్టీఆర్ విగ్రహం వద్ద, గడియార స్తంభం వద్ద, కేజీ రోడ్డులో పలు చోట్ల రోడ్డు దెబ్బతిందని పల్నాడు జిల్లా వినియోగదారుల సంఘం నాయకులు మురికిపూడి ప్రసాద్ ఫిర్యాదుచేశారు. వాహనదారులు తీవ్ర అసౌకర్యాన్ని గురవుతున్నారని, ప్రమాదాలు జరుగుతున్నాయని రహదారిపై పడినగుంతలు సరిచేయాలని కోరారు.

● చిలకలూరిపేట: జగన్ అసెంబ్లీ వెళ్లకుండా వీధి నాటకాలు వేస్తే ప్రయోజనం లేదని, నమ్మి ఓట్లేసిన ప్రజలకు జగన్ సమాధానం చెప్పాలని జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కో-కన్వీనర్ పెంటేల బాలాజి విమర్శించారు. అవకాశం లేని ప్రతిపక్ష హోదా ఇవ్వాలని అడ్డగోలుగా జగన్ వాదిస్తున్నారని ఆరోపించారు.

● చిలకలూరిపేట: చిలకలూరిపేట పట్టణ బీసీ సెల్ కార్యవర్గాన్ని పార్టీ శ్రేణులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ బీసీ సెల్ కమిటీ అధ్యక్షుడిగా అవ్వారు లక్ష్మణ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా యలగాల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా ఎం.వేంకట శివ రామ్, ఎస్.శ్రీనివాసరావులు ఎన్నికయ్యారు.

● చిలకలూరిపేట: పట్టణంలోని చౌత్ర సెంటర్లోని వీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో స్వామివారి జన్మ నక్షత్రమైన పూర్వ భద్ర నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. 3 వేల మందికి అన్నదానం నిర్వహించారు.

● చిలకలూరిపేట: పట్టణంలోని 29వ వార్డులోని బిస్మిల్లా బజార్‌లో అపరిశుభ్రతపై స్థానికులు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు దృష్టికి తీసుకురావడంతో సోమవారం ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయిస్తున్నారు. క్లస్టర్ ఇన్చార్జి కరీముల్లా, బేరింగ్ మౌలాలి ఆధ్వర్యంలో ఈ పనులు జరిగాయి.

● నరసరావుపేట టౌన్: ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో సోమవారం అంతర్జాతీయ ఫిజియోథెరపీ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఎంఆర్ శేషగిరిరావు, కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య పృథ్వీరాజ్, ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మాచినేని ప్రసాదరావు, ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాధినేని రామారావు, లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కందుల వీరబ్రహ్మం, బీఈడ్ ప్రిన్సిపాల్ రవీంద్ర, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

● నరసరావుపేట రూరల్: ఎస్ఈసీ కళాశాలలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ విభాగాధిపతి డాక్టర్ బి.ఝాన్సీ వజ్రంకు కౌన్సిల్ ఫర్ స్కిల్ కంపెటెన్సెస్ సంస్థ బెస్ట్ టీచర్ ఆఫ్‌ది ఇయర్ - ఎక్సలెన్స్ ఇన్ టీచింగ్ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకటకోటేశ్వరరావు, కళాశాల వైస్‌చైర్మన్ చక్రవర్తి, కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఎం.రమేష్ అభినందించారు.

● రొంపిచర్ల: ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందుకున్న మండలంలోని గోగులపాడు జడ్పీ పాఠశాలలో పనిచేస్తున్న ఈదర కోటయ్యస్వామి, ఎంపీపీఎస్ ఏఏ పాఠశాలలో పనిచేస్తున్న షేక్ ఖాశింవలికి పాఠశాలలో సోమవారం సన్మానం జరిగింది. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు యశోధర, బ్రహ్మేశ్వరరావు పాల్గొన్నారు.

● నరసరావుపేట టౌన్: మండల టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడిగా దాసరి నరసింహారావును, ప్రధాన కార్యదర్శిగా బీమవరపు దుర్గారావును నియమించారు. సోమవారం టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో వీరికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు నియామక పత్రాలు అందజేశారు.

● కాకాని (నరసరావుపేట రూరల్): మండలంలోని కాకాని గ్రామంలోని చేపల చెరువుకు మంగళవారం ఉదయం 10:30కి వేలం నిర్వహించనున్నట్లు ఆర్డీవో కె.మధులత తెలిపారు. గ్రామ సచివాలయం వద్ద ఈ వేలం జరుగుతుందన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఇతర అధికారులు

## అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యం

● పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో అందిన అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. పీజీఆర్ఎస్ ద్వారా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీలను జిల్లా కలెక్టర్ పీ అరుణ్ బాబుతో పాటు జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే, జిల్లాల రెవెన్యూ అధికారి అర్జీలను స్వీకరించారు. నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో 122 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పీ అరుణ్ బాబు మాట్లాడుతూ అర్జీదారుని సంతృప్తే ధ్యేయంగా అర్జీల పరిష్కార తీరు ఉండాలని స్పష్టం చేశారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా చర్యలు ఉండాలన్నారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖిగా మాట్లాడి ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. సమస్యలు తన పరిధిలోనివి కానప్పుడు వెంటనే సంబంధిత శాఖకు పరిష్కారం కోసం పంపాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

● మెడికల్ కళాశాలలు ప్రైవేట్ భాగస్వామ్యంతో నడపడానికి చేసుకున్న ఒప్పందం రద్దు చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వం 17 మెడికల్ కళాశాలలు ఏర్పాటుకు ప్రయత్నం చేస్తే, కూటమి ప్రభుత్వం వాటిలో పది మెడికల్ కళాశాలలను ప్రైవేట్ భాగస్వామ్యంతో నడపడానికి ఒప్పందం చేసుకున్నామని ప్రకటించడాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు ఆందోళన చేస్తున్నాయన్నారు. ఇప్పటికే ప్రైవేటీకరణ వలన పేదలకు వైద్య విద్య అందటం లేదని, ఇకనైనా ప్రభుత్వం వైద్య విద్యను జాతీయం చేసి ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎం నాయకులు వై వెంకటేశ్వరరావు, నల్లపాటిల రామారావు, పీడీఎం జిల్లా కార్యదర్శి జీ రామకృష్ణ, అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, కేఎన్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కే కృష్ణ, పీకేసి జిల్లా కమిటీ సభ్యుడు కంబాల ఏడుకొండలు, ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీ కోటానాయక్, ఎంసీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు అబ్రహం లింకన్ పాల్గొన్నారు.

● శావల్యాపురం, రొంపిచర్ల, బొల్లాపల్లి: సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎరువుల కొరత సమస్యలను పరిష్కరించాలని సీపీఐ నాయకులు తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన తెలిపి పీజీఆర్ఎస్‌లో తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. శావల్యాపురంలో సీపీఐ మండల కార్యదర్శి రాయబారం వందనం, సీపీఐ నాయకులు తహసీల్దార్ అర్జున్ నాయక్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కె.మల్లికార్జునరావు, మరియబాబు, సాంబయ్య, వెంకట్రావు, లక్ష్మయ్య తిరుపాలు పాల్గొన్నారు. రొంపిచర్లలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, సీపీఐ ఏరియా కార్యదర్శి చక్రవరం సత్యనారాయణరాజు, ఉప్పలపాటి రంగయ్య, రొడ్డ అంజిరెడ్డి, జె.వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు తదితరులు తహసీల్దార్ బండి నిర్మలకు వినతిపత్రం అందజేశారు. బొల్లాపల్లిలో తమసీల్దార్ ఏ సుధాకర్‌కు సీపీఐ నాయకులు పీ వెంకటేశ్వర్లు, షేక్ సైదావలి తదితరులు వినతిపత్రం అందజేశారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులే దేశ భవిష్యత్తు అని వారికి నాణ్యమైన విద్య అందించాలని, అది అందరి బాధ్యత అని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. సోమవారం నరసరావుపేట పట్టణం ప్రకాష్‌నగర్‌లో తిలక్ ప్రభుత్వ పాఠశాలలో రూ.6లక్షలతో ప్రారంభించిన మరమ్మతు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ విద్యార్థులకు పాఠశాలలో మంచి సౌకర్యాలు అందించడం లక్ష్యంగా మరిన్ని చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులకు ఎమ్మెల్యే కొద్దిసేపు పాఠాలను బోధించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి, మౌలిక సౌకర్యాల గురించి ప్రధానోపాధ్యాయుడు జీ వెంకటరమణారావుతో చర్చించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, స్థానికులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పాఠాన్ని బోధిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు



ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ కంచి శ్రీనివాసరావు

## పీజీఆర్ఎస్‌లో ఎస్పీకి 111 ఫిర్యాదులు

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి), ప్రతి సోమవారం పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం నిర్వహించారు. ఎస్పీ కంచి శ్రీనివాసరావు కార్యక్రమంలో పాల్గొని ప్రజల వద్ద నుంచి 111 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యమిచ్చి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులకు ఎస్పీ ఆదేశించారు. చిలకలూరిపేట మండలం తాతపూడి గ్రామానికి చెందిన ఇంటూరి సుబ్బాయమ్మ వద్ద ఆమె మనుమడు బాగోగులు చూసుకుంటానని పొలం, బంగారం, నగదు తీసుకొని తన యోగక్షేమాలు చూడకుండా మోసం చేసినట్లు తగున్యాయం చేయాలని ఫిర్యాదుచేశారు. చిలకలూరిపేటకు చెందిన విప్పర్ల ఏడుకొండలు వద్ద అతని బంధువు భూపతి వీరాంజనేయులు షేర్ల వ్యాపారం నిమిత్తం రూ.11 లక్షల 70,000 నగదు తీసుకున్నాడని, అనంతరం భార్యా పిల్లలను తీసుకొని ఇంటి నుంచి వెళ్లిపోయాడని అతని తల్లిదండ్రులను విచారించగా తమకు తెలియదు అంటున్నారని తగున్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు. చిలకలూరిపేట మండలం పసుమర్రు గ్రామానికి చెందిన మందపల్లి ప్రసన్నాంజనేయులు వద్ద గూడపాటి ప్రసాద్ అతని భార్య రాధికలు 15 లక్షల రూపాయలు అప్పుగా తీసుకొని తీసుకొని తిరిగి ఇవ్వకుండా బెదిరిస్తున్నారని ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు వారి ఫిర్యాదులను రాసి పెట్టడంలో పోలీస్ సిబ్బంది సహాయ సహకారాలు అందించారు.

కార్యక్రమంలో పరిపాలన అదనపు ఎస్పీ జేవీ సంతోష్, నరసరావుపేట మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఎం.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని జీవిత చరిత్రను ప్రదర్శించాలి

● పల్నాడు జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఏలూరి శశికుమార్

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోడీ జీవిత చరిత్ర తెలిసేలా డిజిటల్ రూపంలో జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలు, ప్రధాన కూడళ్లలో ప్రదర్శన చేయాలని కోరారు. సోమవారం పట్టణంలోని కుసుమ హరనాథ కల్యాణ మండపంలో ప్రధాని నరేంద్రమోడీ జన్మదినం సందర్భంగా సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2 గాంధీ జయంతి వరకు సేవా పక్షోత్సవాలు విజయవంతం చేయటం కోసం బీజేపీ పల్నాడు జిల్లా కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరి శశికుమార్ మాట్లాడుతూ దేశసామాన్య ప్రజలకు అనుకూలంగా ఉండేలా నిత్యావసరాలను చాలావరకు జీరో శాతానికి తగ్గించి కేవలం రెండు శ్లాబ్‌లకే పరిమితం చేయడం జరిగిందన్నారు. అనంతరం కార్యశాల నుంచి మల్లమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి, ప్రధాని నరేంద్రమోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మేకల హనుమంతరావు యాదవ్, రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి కిలారు దిలీప్, రాష్ట్ర ఐటీ కన్వీనర్ మకుటం శివ, జిల్లా పార్టీ ఇన్‌చార్జి కొక్కెర శ్రీనివాస్ యాదవ్, సేవా పక్వాడ్ పల్నాడు జిల్లా కమిటీ సభ్యులు కట్టా సుబ్బారావు, మైలవరపు సుబ్బారావు, గోకినేని వెంకటరమణ, మండల కన్వీనర్లు, కో-కన్వీనర్లు, జిల్లా బీజేపీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## షెడ్డు నిర్మాణం పూర్తయినా ఎంబుక్ చేయట్లేదని ఫిర్యాదు

శావల్యాపురం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా కూటమి ప్రభుత్వం మంజూరు చేసిన గోకులంషెడ్డు నిర్మాణం పూర్తయి నెలలు గడుస్తున్నా అధికారులు నిర్మాణానికి సంబంధించి ఎంబుక్ చేయకుండా ఇబ్బంది పెడుతున్నారని మండలంలోని మతుకుమల్లి గ్రామానికి చెందిన ముంద్రు రామాంజనేయులు అధికారులకు ఫిర్యాదు చేశాడు. షెడ్డు నిర్మాణానికి సంబంధించి రెండు సార్లు బిల్లులు తెచ్చి అధికారులకు ఇవ్వగా వాటిని పోగొట్టారని, మరలా బిల్లులు తెచ్చి ఉపాధి హామీ టీఏ ముత్యాలరాజును కలసి ఎంబుక్ చేయమని అడిగితే ఆగ్రహం వ్యక్తం చేశారని వాపోయారు. షెడ్డుకు ఇంతవరకు కొలతలు తీయలేదన్నాడు. దీనిపై ఇన్‌చార్జి ఏపీవో ఆంజనేయరాజును వివరణ కోరగా రామాంజనేయులు గోకులం షెడ్డుకు వెంటనే ఎంబుక్ చేసి బిల్లులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

## రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి: ఏవో వరలక్ష్మి

వినుకొండ టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రసాయన ఎరువులు వినియోగాన్ని తగ్గిస్తూ, జీవన ఎరువులు నానో ఎరువులు వాడకం రైతులకు మేలని మండల వ్యవసాయ అధికారి జి.వరలక్ష్మి తెలిపారు. మండలంలోని నరగాయపాలెం రైతు సేవా కేంద్రంలో రైతులకు వివిధ పంటలకు యూరియా వాడకంపై అవగాహన కల్పించారు. ఏవో మాట్లాడుతూ రసాయన ఎరువులు వాడకం తగ్గించడం వలన నేలలో సేంద్రియ కర్బనశాతం పెరగటంతో పాటు రైతులకు ఖర్చు తగ్గి, నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. పొగాకు సాగు కాకుండా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేపట్టాలని సూచించారు. ఉద్యాన అధికారి నబీ రసూల్ మాట్లాడుతూ మిరప పంటలో అధిక మోతాదులో యూరియా వాడితే పచ్చదనం పెరిగి చీడపీడలు ఆశించి, దిగుబడులు తగ్గుతాయని వివరించారు. ఉద్యాన పంటలకు ప్రభుత్వం వారు కల్పించే రాయితీ వివరాలను తెలియజేసి ఆయా సబ్సిడీలను సద్వినియోగపరచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో ఆరిఫ్, గ్రామ ఉద్యాన సహాయకుడు గురునాథం, తదితరులు పాల్గొన్నారు.

## వెనుకబడిన విద్యార్థుల్లో సామర్థ్యాలు మెరుగుపరచాలి

● మండల విద్యాశాఖాధికారి సాంబశివరావు

శావల్యాపురం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక బోధనను అందించి వారిలో సామర్థ్యాలను మెరుగుపరచాలని ఎంఈవో మద్దిగుంట్ల సాంబశివరావు అన్నారు. శావల్యాపురం ప్రాథమిక పాఠశాలను ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. విద్యార్థులతో పాఠాలు చదివించి సామర్థ్యాలు పరిశీలించారు. విద్యార్థులతో కలసి మధ్యాహ్నభోజనం నాణ్యతలను పరిశీలించారు. ఎంఈవో మాట్లాడుతూ పాఠశాల్లో మొత్తం 30మంది విద్యార్థులుండగా 20మందిలో విద్యాసామర్థ్యాలు తక్కువగా ఉన్నాయని, వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. మధ్యాహ్నభోజనానికి ప్రభుత్వం సన్నబియ్యం సరఫరా చేయడంతో విద్యార్థులంతా పాఠశాలల్లోనే భోజనం చేస్తున్నారని, భోజనం బాగుందని సంతృప్తిని వ్యక్తం చేశారు. హెచ్ఎం లక్ష్మీపద్మజ, టీచర్‌లు వరలక్ష్మి, మేరీ, షాల్నా ఆరీఫా తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల పంపిణీపై సమీక్ష

బొల్లాపల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రైతు సేవా కేంద్రంలో వినుకొండ వ్యవసాయ సంచాలకులు రవికుమార్ అధ్యక్షతన బొల్లాపల్లి మండలంలోని రైతులు, డీలర్లు, ప్రజా ప్రతినిధులకు యూరియా లభ్యత వాడకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రవి కుమార్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, మెజిస్ట్రేట్ వారి ఆదేశాల మేరకు సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా రవి కుమార్ మాట్లాడుతూ బొల్లాపల్లి మండలంలో ప్రస్తుతం 65 టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. పైపాటుగా నానో యూరియాను చల్లుకుంటే మంచి ఫలితాలు వచ్చినట్టు తెలిపారు. అదేవిధంగా తహసీల్దార్ సుధాకర్ మాట్లాడుతూ ఎక్కడైనా యూరియా అందుబాటులో లేకపోతే తనను గాని, మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలన్నారు. ఎస్ఐ బాలకృష్ణ మాట్లాడుతూ ఎవరైనా యూరియా అక్రమంగా నిల్వ చేసినా, అవసరానికి మించి కొనుగోలు చేసినా ఆ స్టాక్‌ను సీజ్‌చేసి కేసు నమోదు చేయటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఏ అంకారావు, ఎంపీడీవో పీ మాధురి, స్థానిక నాయకులు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

## యూరియా కొరత లేదు: ఏవో హరిప్రసాద్

యడ్లపాడు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో సరిపడ యూరియా నిల్వలు ఉన్నాయని, ఎటువంటి కొరతలేదని మండల వ్యవసాయాధికారి హరిప్రసాద్ తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన యడ్లపాడులో రెవెన్యూ, మండల పరిషత్ అధికారులతో కలసి రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్‌లతోపాటు ప్రైవేటు ఎరువుల దుకాణాలలో యూరియా నిల్వలు ఉన్నాయని రైతులు ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయశ్రీ, ఎంపీడీవో హేమలతాదేవి, డీటీ అనూరాధ, పంచాయితీ కార్యదర్శి శశికళ, వీఆర్వోలు బాషా, రఫుల్లా, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

## పని ప్రదేశాలలో మహిళలకు రక్షణ కల్పించాలి

● ఐసీడీఎస్ సీడీపీవో శాంతకుమారి

యడ్లపాడు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పని ప్రదేశాలలో మహిళలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ఆయా సంస్థల యాజమాన్యాలదేనని ఐసీడీఎస్ నాదెండ్ల సీడీపీవో శాంతకుమారి అన్నారు. మిషన్ సంకల్ప్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎన్ఎస్ఎల్ టెక్స్‌టైల్ మిల్లులో అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు పనిచేసే చోట కనీస సౌకర్యాలు కల్పించడంతోపాటు ఎలాంటి వేధింపులు లేకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. సోషల్ కౌన్సిలర్ ఎం.సంగీత గృహహింస, మహిళలకు రక్షణ కల్పిస్తున్న చట్టాల గురించి వివరించారు. ఓఎస్‌సీ లీగల్ కౌన్సిలర్ కె.వాణిశ్రీ మాట్లాడుతూ పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక దాడులు నివారించేందుకు అంతర్గత ఫిర్యాదు కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, కార్మికులు, గర్భవతులు, బాలింతలు, పాల్గొన్నారు.

## 200మందికి కంటి వైద్య పరీక్షలు

గుంటుపాలెం (శావల్యాపురం) సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటకు చెందిన రామలింగారెడ్డి మాక్స్‌విజన్ వారి ఆధ్వర్యంలో ఇన్‌చార్జి సర్పంచ్ మద్దినేని ఆంజనేయులు సహాయ సహకారాలతో మండలంలోని గుంటుపాలెంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని సోమవారం నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి సుమారు 200మంది కంటిపరీక్షలు చేయించుకొన్నారు. వారిలో 25మందికి కంటిశుక్లాలు ఉన్నట్లు గుర్తించారు. మిగిలినవారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శుక్లాలు ఆపరేషన్‌లు అవసరమైనవారికి నర్సరావుపేటలోని హాస్పిటల్‌కు తరలించి ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని వైద్యులు తెలిపారు. వైద్యశిబిరానికి సహకరించిన ఇన్‌చార్జి సర్పంచ్ ఆంజనేయులుకు సిబ్బంది ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన

నూజెండ్ల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల్లో పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా పంటల సాగులో రైతులు అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయ అధికారి ఆంజనేయులు నాయక్ అన్నారు. సోమవారం చింతలచెరువు గ్రామంలో పర్యటించి రైతులతో సమావేశమై పొగాకు పంటలు గడిచిన కాలంలో రైతులు మార్కెట్ సమస్యలను ఎదుర్కొన్నారని, క్లిష్ట పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటలుగా పప్పు ధాన్యాలు, కూరగాయలు, పసుపు, తోటల పెంపకం చేపట్టడం లాభదాయకంగా ఉంటుందన్నారు.



రోడ్డు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అరవిందబాబు, తదితరులు

## గ్రామీణ ప్రాంత రోడ్లకు మహర్దశ

ఎమ్మెల్యే అరవిందబాబు

రొంపిచర్ల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత రోడ్లకు కూటమి ప్రభుత్వంలో మహర్దశ పట్టిందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు సోమవారం పేర్కొన్నారు. మండల కేంద్రమైన రొంపిచర్ల నుంచి కర్లకుంట వరకు రూ.2కోట్ల నిధులతో నిర్మించనున్న తారు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొద్ది రోజుల క్రితం రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని మంత్రి పవన్ కళ్యాణ్‌ను కలసి విజ్ఞప్తి చేయగా రూ.5.50కోట్లు నిధులు మంజూరు చేశారనానరు. ప్రస్తుతం రొంపిచర్ల, కర్లకుంట రహదారి నిర్మాణం చేపడుతున్నామన్నారు. త్వరలో మిగిలిన రూ.3.50కోట్ల నిధులతో రహదారుల నిర్మాణం చేపడతామన్నారు. కార్యక్రమంలో పల్లెల నాగిరెడ్డి, పులుకూరి జగ్గయ్య, ఇంటూరి ప్రసాదు, మండలంలోని పలు గ్రామాల తెలుగుదేశం పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



ఎంపికైన బాలికల, బాలుర జట్లు

## జిల్లా సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ జట్ల ఎంపిక

రొంపిచర్ల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రొంపిచర్ల జడ్పీ పాఠశాల ఆవరణలో జిల్లా సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ ఎంపికలు సోమవారం జరిగాయి. బాలుర, బాలికల విభాగంలో జిల్లా నుంచి 150మంది క్రీడాకారులు పాల్గొన్నారు. బాలుర జట్టుకు 16మంది, బాలికల జట్టుకు 16 మందిని ఉమ్మడి జట్టుకు ఎంపిక చేశారు. జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ ఎంపికలు జరిగాయి. అక్టోబరు నెలలో వైజాగ్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ రెండు జట్లు పాల్గొంటాయని హెచ్ఎం సుభానీ తెలిపారు. కార్యక్రమంలో పీసీ కమిటీ చైర్మన్ ఏడుకొండలు, రిటైర్డు హెచ్ఎం రామకృష్ణారెడ్డి, 30 మంది ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

## వీరవట్నంలో వైద్య శిబిరం



వీరవట్నంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ చదలవాడ ఆదిత్య

రొంపిచర్ల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరవట్నంలో ఉచిత వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. అమూల్య నర్సింగ్ హోమ్ ఆధ్వర్యంలో జరిగిన వైద్య శిబిరంలో ఎమ్మెల్యే అరవిందబాబు తనయుడు డాక్టర్ చదలవాడ ఆదిత్య, డాక్టర్ సాయి ప్రణవి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఆయాసం, దగ్గు, జలుబు, మలేరియా, డెంగీ, థైరాయిడ్, బీపీ, షుగర్, ఆర్థోపెడిక్ వంటి వాటికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు పల్లెల నాగిరెడ్డి, చల్లా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## రొంపిచర్ల పీహెచ్‌సీలో డిప్యూటీ డీఎంహెచ్‌వో తనిఖీ



రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎం హెచ్‌వో పద్మావతి

రొంపిచర్ల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పద్మావతి సోమవారం తనిఖీ చేశారు. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర అవార్డుల ఎంపికలో భాగంగా ఈ తనిఖీలు చేస్తున్నట్టు ఆమె తెలిపారు. ఆస్పత్రిలో వైద్య సేవలు, వసతులను, వైద్యశాలలో అందుతున్న సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నివేదికలను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు జగన్ నరసింహారెడ్డి, నిమ్మల సాయిబాబు పాల్గొన్నారు.

## గాడి తండాలో వైద్య శిబిరం



గాడి తండాలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బొల్లాపల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాడితండాలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణానాయక్ మాట్లాడుతూ గ్రామాల్లో ఇళ్ళ ముందు మురుగు కుంటలు లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. గ్రామస్థులందరికీ డెంగీ, మలేరియా పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మాధవ్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.




ర్యాలీలో పాల్గొన్న తహసీల్దార్ రమేష్ కుమార్, విద్యార్థులు

## నూజెండ్లలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవ ర్యాలీ

నూజెండ్ల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం మండల కేంద్రం నూజెండ్లలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ పాఠశాల, కేజీబీవీ విద్యార్థులు ర్యాలీలో పాల్గొని ప్రధాన కూడళ్ళల్లో మానవహారంగా ఏర్పడి అక్షరాస్యత ప్రాధాన్యంపై నినాదాలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జీ రమేష్‌కుమార్, ఎంఈవో కే సత్యనారాయణ, పాఠశాల హెచ్ఎం కే శ్రీదేవి, కేజీబీవీ ప్రిన్సిపాల్ ఉషారాణి, వయోజన విద్య సూపర్ వైజర్ కే వెంకటేశ్వర్లు, పీడీ వెంకటరత్నం, చంద్ర ప్రకాష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

● నాదెండ్ల: అక్షరాస్యతతోనే దేశాభివృద్ధి జరుగుతుందని సాహితీ వేత్త డాక్టర్ పీవీ సుబ్బారావు అన్నారు. మండల కేంద్రమైన నాదెండ్లలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో జ్ఞానేశ్వరి అర్బన్, రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సుబ్బారావు ప్రసంగించారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి దార్ల బుజ్జిబాబు, ప్రత్యేక అధికారి మాధవీలత, సంస్థకు చెందిన గేరా యాకోబు, సతీష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.